


# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, గురువారం 16-06-2022 VIJAYABHANU DAILY ⋆ VISAKHAPATNAM సంపుటి : 45 సంచిక : 230 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## మౌలిక సదుపాయాల అభివృద్ధిపై
# ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి

### ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎంఈలపై స్పెషల్ ఫోకస్

### ఇండస్ట్రియల్ పార్కుల్లో కాలుష్య నివారణ..

### ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో పరిశ్రమల అభివృద్ధి, పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై సమీక్ష చేపట్టారు. ఈ సమావేశానికి పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా.. పరిశ్రమల కోసం కేటాయించిన భూముల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని సీఎం వైఎస్ జగన్.. అధికారులను ఆదేశించారు. అలాగే, పెద్ద ఉత్తున ఉపాధిని కల్పిస్తున్న ఎంఎస్ఎంఈలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. సకాలంలో వారికి ప్రోత్సాహ కాలు అందేలా చూడాలన్నారు. కాగా, దేశంలో ఎవ్వరూ చేయని విధంగా ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఇచ్చిందని అధికారులు.. సీఎం జగన్‌కు తెలిపారు.

ఈ నేపథ్యంలో ఇదే ఒరవడి కొనసాగాలన్న సీఎం జగన్ స్పష్టం చేశారు. ప్రతీ ఏటా.. క్రమం తప్పకుండా ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని సీఎం జగన్ సూచించారు.

**ఇండస్ట్రియల్ పార్కుల్లో కాలుష్య నివారణ..**

పారిశ్రామిక వాడల్లో కాలుష్యాన్ని నివారించే వ్యవస్థలను పరిశీలించాలి. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీకి తగిన స్థాయిలో ఉన్నాయా? లేవా? చూడాలి.

ప్రత్యేక నిధి ద్వారా కాలుష్య నివారణ వ్యవస్థలను పారిశ్రామిక వాడల్లో బలోపేతం చేయాలి. సంబంధిత యూనిట్లకు ప్రభుత్వం నుంచి కొంత సహాయం చేసే రీతిలో విధానాన్ని తీసుకురావాలని సీఎం జగన్ ఆదేశించారు.

ఈ క్రమంలో పంప్డ్ స్టోరేజీ పవర్ ద్వారా వాల్యూ అడిషన్ చేస్తున్నామని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా తయారీలపై ఫోకస్ పెట్టినట్టు తెలిపారు.

దీనివల్ల గ్రీన్‌ఎనర్జీ రంగంలో చాలా ముందడుగు వేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించి కూడా పాలసీలు తయారు చేయాలని సీఎం జగన్ ఆదేశించారు.

## రాష్ట్రపతి ఎన్నికకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల



న్యూఢిల్లీ: రాష్ట్రపతి ఎన్నికకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల అయ్యింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం.. భారత దేశ 16వ రాష్ట్రపతి ఎన్నికల కోసం గెజిట్‌ను విడుదల చేసినట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. భారత దేశ అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి ఎన్నికలకు నేడు నోటిఫికేషన్ విడుదల అయ్యింది. ఈ ఎన్నికల ద్వారా భారతదేశ 16వ రాష్ట్రపతిని ఎన్నుకోబోతున్నారు. ఈ నెల 29 వరకు రాష్ట్రపతి పదవికి పోటీ చేయాలనుకునే అభ్యర్థులు నామినేషన్లు వేయవచ్చు. జులై 18న ఎన్నికలు జరుగుతాయి. జులై 21న కౌంటింగ్ జరుగుతుంది. ప్రస్తుత రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ పదవీ కాలం జులై 24న ముగుస్తోంది. కొత్త రాష్ట్రపతి జులై 25న ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది.


సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరుగుతాయి. లోక్ సభ, రాజ్యసభ సభ్యులు, రాష్ట్రాల్లోని ఎమ్మెల్యేలతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ రాష్ట్రపతిని ఎన్నుకుంటుంది. ఢిల్లీ, పుదుచ్చేరి అసెంబ్లీ సభ్యులు కూడా ఓటింగ్ లో పాల్గొంటారు. రాష్ట్రపతి ఎన్నికలకు రాజ్యసభ సెక్రటరీ జనరల్ రిటర్నింగ్ అధికారిగా

తరువాయి 2లో..

# వైసీపీ పతనం ప్రారంభమైంది

- టిడిపి మినీ మహానాడుకు ప్రజలు బ్రహ్మారథం
- చోడవరం మహానాడు తో వైసీపీ పతనం ప్రారంభం
- ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు పండుగ లా చేద్దాం
- ఎన్టీఆర్ స్ఫూర్తి, చంద్రన్న భరోసాతో ప్రజలందరికీ అండగా ఉంటా
- మినీ మహానాడులో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు





చోడవరం ( విజయభాను న్యూస్)- చోడవరం పట్టణం వేదికగా మొదటిసారిగా బుధవారం సాయంత్రం జరిగిన మినీ మహానాడు కు ప్రజలు వేలాదిగా తరలివచ్చి బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ చోడవరంలో జరిగిన

తరువాయి 2లో..

## నేటి అర్ధరాత్రి నుండి సముద్రంలో
# చేపల వేటపై నిషేధం ఎత్తివేత

### మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రెండు నెలల విరామం అనంతరం నేటి అర్ధరాత్రి నుండి సముద్రంలో చేపల వేటకు నిషేదం ఎత్తివేయడం జరిగిందని, రాష్ట్ర పశుసంవర్ధక మరియు మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫిషింగ్ హార్బర్ మరియు మత్స్యకారుల సమస్యల పరిస్కారానికై మంత్రి సీదిరి అప్పలరాజు అధ్యక్షతన ఫిషింగ్ హార్బర్ మేనేజ్ మెంటు హై లెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పిషింగ్ హార్బర్ పరిసర ప్రాంతాలలో మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయవల్సినదిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలను పరిరక్షించుట, కొత్తవారిని గుర్తించడం మరియు హార్బర్ నందు ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పెట్రోలింగ్ నిర్వహించుటతో పాటు జెట్టీ 1 నుండి 11వ జెట్టీ వరకు సి.సి కెమెరాలు ఏర్పాటు చేయవలసినదిగా అధికారులను ఆదేశించారు. హార్బర్ ఆధునీకరణ చేయుటకు ప్రతిపాదనలను గురించి జిల్లా కలెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. అదే విదంగా ఖాళీగా ఉన్న 5 సాగర మిత్రా పోస్టులను వెంటనే భర్తీ చేసి మూడు షిప్టులలో 24 గంటలు

అందుబాటులో ఉంచి, హార్బర్ లో వేటకు వెళ్లే బోట్ల యొక్క రాకపోకల వివరాలు చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల వివరాలు నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. మత్స్యకారులకు గుర్తింపు కార్డులను 10 రోజుల లోగా అందజేయాలని మత్స్యశాఖ జాయింట్ డైరక్టరు ను

తరువాయి 2లో..

## కర్మ సిద్ధాంతం.. చేసిన పాపాలు అనుభవించాల్సిందే



దిల్లీ: రాష్ట్రపతి ఎన్నికల్లో పార్టీ వైఖరిపై వైకాపా అధినేత, సీఎం జగన్ నిర్ణయం తీసుకుంటారని ఆ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. పార్లమెంట్ స్థాయీ సంఘం ఛైర్మన్‌గా ఉన్న విజయసాయి.. సంబంధిత నివేదికను ఉపరాష్ట్రపతి

తరువాయి 2లో..

## ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఇంటర్వ్యూలు కొనసాగించండి : హైకోర్టు ఆదేశం



అమరావతి: ఏపీపీఎస్సీ (APPSC) గ్రూప్-1 ఇంటర్వ్యూలు కొనసాగించాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. ఫలితాలు కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. అభ్యర్థుల జవాబు పత్రాలు, మార్కుల వివరాలను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించాలని ఏపీపీఎస్సీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. న్యాయస్థానం ఆదేశాల ప్రకారమే తుది ఎంపిక ఉంటుందని తెలిపింది. ఈ మేరకు ఇంటర్వ్యూ అభర్థులకు సమాచారం ఇవ్వాలని ఏపీపీఎస్సీకి హైకోర్టు సూచించింది.



# అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇంటి స్థలం మంజూరు

## జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు విడదల రజిని





విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రాష్ట్రంలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇంటి స్థలం మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు విడదల రజిని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం విశాఖపట్నం పట్టణ పరిధిలో ఉత్తర నియోజకవర్గం, డియల్బీ గ్రౌండ్స్ లో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గంలో అర్హులైన 19399 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాల మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే విధంగా ఇంటి పట్టా రెగ్యులరైజేషన్ క్రింద 295 పట్టాలు, జగనన్న స్వచ్ఛ గృహ హక్కు క్రింద 204 మందికి పట్టాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క పేదవారికి సొంత ఇల్లు ఉండాలనే సంకల్పంతో అక్క చెల్లెళ్ల పేరు మీద ఇళ్ల పట్టాలను కేటాయించడం జరిగిందని , ముఖ్యమంత్రి రాష్ట్రంలో సుమారు 30 లక్షల మందికి ఇంటి పట్టాలు ఉచితంగా మంజూరు చేశారని, అదే విధంగా ఇంటి నిర్మాణాలకు కూడా సహాయం అందిస్తున్నారని పేర్కొన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ ఏ.మల్లికార్జున మాట్లాడుతూ ఇంటి స్థలం మంజూరు అయిన ప్రతి లబ్ధిదారుడు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు చేపట్టి పూర్తిచేయాలని అని సూచించారు.

ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం వి వి సత్యనారాయణ , టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ రావు , జీవిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవిఎంసి కమిషనరు లక్ష్మీ షా, రెవిన్యూ అధికారులు, నియోజకవర్గ కార్యకర్తలు కార్పొరేషన్ డైరెక్టర్ లు అధిక సంఖ్యలో లబ్దిదారులు, మహిళలు పాల్గొన్నారు.

# పారదర్శకంగా సంక్షేమ పథకాలు

**- అవినీతికి తావులేని ప్రభుత్వం ఇది - పారదర్శక రీతికి సంకేతం వార్డు సచివాలయం**

**- అవినీతి రహిత పాలనకే అత్యంత ప్రాధాన్యం - స్థానిక సమస్యలపై సత్వర పరిష్కారం**

**- పథకాల అమలు సంతృప్తికరం**

**- నానుబాల వీధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పష్టం చేసిన మంత్రి ధర్మాన -**



శ్రీకాకుళం : రాష్ట్ర ప్రభుత్వం గడిచిన మూడేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తుందని రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్లు మరియు స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 24వ డివిజన్ పరిధిలోని నానుబాల వీధితో పాటు పలు వీధుల్లో గడప గడపను మంత్రి సందర్శించారు. పథకాల లబ్ధిదారులతో మాట్లాడి, వాటి అమలు తీరు తెన్నులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. అవినీతి రహిత పాలనను అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. అలాగే స్థానిక సమస్యలతో పాటు వార్డు సచివాలయ పని తీరు, మెరుగైన సేవలు అందించడంపై స్థానిక ప్రజానీకాన్ని ఆరా తీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించేలని నగరపాలక సంస్థ అధికారులను మంత్రి ఆదేశించారు. తొలుత స్థానిక 24వ డివిజన్ రైతు బజారు పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన ఆయన వార్డు సెక్రటేరియట్ నెంబర్ 009 సచివాలయం సందర్శించి అక్కడి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలిసి పథకాలు అందుతున్న తీరు గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధర్మాన దృష్టికి వచ్చిన స్థానిక సమస్యలకు వెంటనే పరిష్కారం చూపారు. మ్యుటేషన్-కు సంబంధించి ఒకే ఒక్క అర్జీ వచ్చిందని, అది కూడా వెంటనే క్లియర్ చేయాలని నగరపాలక సంస్థ కమీషనర్ చల్లా ఓబులేశును మంత్రి ఆదేశించారు. ఆంగ్ల మాధ్యమంపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, వీటిపై మీ అభిప్రాయమేమిటని మంత్రి ప్రజలను కోరగా, తమ పిల్లల బంగారు భవిత కోసం ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయం ఇదని, దీన్ని కొనసాగించాలని మంత్రికి వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై లబ్ధిదారులను ఆరా తీసిన మంత్రికి గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా ఈ ప్రభుత్వం ఇంటివద్దకే అన్ని సంక్షేమ పథకాలు అందజేయడం శు భపరిణామమని లబ్ధిదారులు బదులిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్నసంక్షేమ పథకాలతో ఆర్థిక లబ్ధి పొంది సమాజంలో గౌరవంగా బతకాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియాతో మంత్రి ధర్మాన మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఒక ఆరోపణ కూడా చేయలేని విధంగా ప్రభుత్వం పాలనను అందిస్తుందని గుర్తుచేసారు. ఈ ప్రభుత్వం గడిచిన మూడేళ్లలో లక్షా 40వేల కోట్ల రూపాయలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమచేసిందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరినీ కలిసేందుకు, వారి యోగక్షేమాలతో పాటు ఇతర ఆర్థిక ప్రయోజనాల విషయమై వివరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు.

ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా ప్రజలకు కావలసిన అవసరాలను ఇంటివద్దకే అందేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. విశ్వసనీయతకు, నీతి నిజాయితీలకు మారుపేరుగా, ఇచ్చిన హామీలకు కట్టుబడి వాటిని అమలుచేసే విధంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఆత్మ గౌరవాన్ని నిలుపుతూ, అవినీతి లేని పాలనను అందించడం జరుగుతుందని, పథకాల నిర్వహణలో దేశానికే ఆదర్శంగా మన రాష్ట్రం నిలిచిందని కితాబిచ్చారు. ఈ పర్యటనలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, నగరపాలక సంస్థ కమీషనర్ చల్లా ఓబులేశు , మాజీ మున్సిపల్ చైర్మన్ మెంటాడ వెంకట పద్మావతీ, వరుదు విజయకుమార్, తోట తారక, సాధు వైకుంఠ రావు, మెంటాడ స్వరూప్, ఊడి సునీత, సంజన, మండవిల్లి రవి, రఫీ, చల్లాశ్రీనివాసరావు, ఖాన్, ఎండ రమేష్, వానపల్లి రమేష్, నాగరాజు,లావేటి శ్యామ్, కింజరాపు రమేష్, బైరి మురళి, డాక్టర్ పైడి మహేశ్వరరావు, మైలపల్లి మహాలక్ష్మి, సీపాన రామారావు, చౌదరి సతీష్, తారక, సుగుణరెడ్డి, జ్యోతి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# వైసీపీ పతనం ప్రారంభమైంది

మినీ మహానాడు తో వైసీపీ పతనం ప్రారంభమైందని అన్నారు. నందమూరి తారక రామారావు 99 సంవత్సరాలు పూర్తి చేసుకొని 100 వ సంవత్సరం లో అడుగుపెడుతున్న సందర్భంగా ఈ ఏడాది పొడవునా శతజయంతి ఉత్సవాలు జరగనున్నాయని, అలాగే తెలుగుదేశం పార్టీ 40 ఏళ్లు పూర్తి చేసుకొని 41 వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తి, చంద్రన్న భరోసాతో ప్రజలందరికీ అండగా ఉంటామని, జగన్ ప్రభుత్వం వచ్చిన నాటి నుండి తప్పుడు కేసులతో భయపడుతున్నారని, ఇక నుంచి ఆటలు సాగవు అన్నారు. టిడిపి అయిపోయిందని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కళలు కంటున్నారని, గెలిచిన మూడేళ్లకే వైసీపీని ప్రజలు విశ్వాసం కోల్పోయిందన్నారు. తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీకగా ఎన్టీఆర్ పార్టీని స్థాపించారని, బీసీలకు సామాజిక న్యాయం చేసిన ఏకైక పార్టీ టిడిపి అన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన నాటి నుండి పెట్రోల్, డీజిల్, విద్యుత్ చార్జీలు , ఆర్టీసీ చార్జీలు మోత మోగిస్తున్నాయి అని, రోడ్లు గుంతలు వేయలేని సీఎం, రాజధాని కడతానని అంటున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని ఇరవై ఆరు జిల్లాల్లో మినీ మహానాడు చేపట్టి వైసిపి ప్రభుత్వ నిజ స్వరూపాన్ని ఎండగడతాం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యేలు కె ఎస్ ఎన్ రాజు, వంగలపూడి అనిత, వెలగపూడి రామకృష్ణబాబు ల తో పాటు అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ బుద్దా నాగ జగదీశ్వర రావు, టిడిపి నాయకులు మల్లు నాయుడు, తాతయ్య బాబు, పెదబాబు, కనీ శెట్టి మత్స్య రాజు, బొడ్డేడ నాగ గంగాధర్, జిల్లాలోని వివిధ నియోజకవర్గాల, మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు, భారీ ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

# కర్మ సిద్ధాంతం.. చేసిన పాపాలు అనుభవించాల్సిందే

వెంకయ్యనాయుడుకు సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్గాంధీ ఈడీ విచారణపై విజయసాయి స్పందించారు. కేంద్రం కక్ష సాధింపేమీ చేయడం లేదని.. కర్మ సిద్ధాంతం ప్రకారం చేసిన పాపాలు అనుభవించాల్సిందేనని ఆయన వ్యాఖ్యానించారు.

# రాష్ట్రపతి ఎన్నికకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల

వ్యవహరిస్తారు. పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలలో పోలింగ్ జరుగుతుంది. మొత్తం 4,809 మంది సభ్యులు ఓటు వేయబోతున్నారు. వీరిలో 776 మంది పార్లమెంటు సభ్యులు కాగా... 4,033 మంది రాష్ట్రాల చట్ట సభలకు చెందినవారు. వీరందరి ఓట్ల విలువ 10,86,431.

అభ్యర్థి పేరేది?

ఈసారి ఎన్నికలు ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. ఇంతవరకు అధికారపక్షం కానీ, విపక్షాలు కానీ తమ అభ్యర్థిని ఖరారు చేయలేదు. దీంతో, సర్వత్రా ఉత్కంఠ పెరిగిపోతోంది. ఇంకోవైపు, రాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో బీజేపీ.. వివిధ పార్టీల మద్దతును కూడగట్టే బాధ్యతలను పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ లకు అప్పగించింది. విపక్షాల తరపున ఆ బాధ్యతను పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీసుకున్నారు.

## నేటి అర్ధరాత్రి నుండి సముద్రంలో

# చేపల వేటపై నిషేధం ఎత్తివేత

ఆదేశించారు. సముద్రంలో మరమ్మత్తులకు గురైన బోటులను రిపేర్లు చేసుకొనుటకు వీలుగా స్థలం కేటాయించాలని పోర్టు అధికారులను కోరారు. నూతనంగా నిర్మించిన పిష్ మార్కెట్లను త్వరలో అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. గత అనుభవాల దృష్యా మత్స్యకారుల సంఘాలు సమన్వయంతో నేటి అర్ధరాత్రి నుండి చేపలు వేటను ప్రారంభించుకోవచ్చునని తెలిపారు. కొన్ని ప్రత్యేక సమస్యలు పరిస్కారానికై ముఖ్యమంత్రివర్యులతో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని మంత్రి మత్స్యకారుల సంఘాలకు హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టరు డా.ఎ.మల్లిఖార్జున మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్ లో చెత్తను ఎప్పటి కప్పుడు తొలగించేందుకు అధికారులను ఆదేశించామన్నారు. సముద్రంలో నిషేదిత ప్రాంతాలలో బోట్లు తిరగకుండా మత్స్యకారుల సంఘాలు మరియు బోటు యజమాన్య సంఘాలు పూర్తి స్థాయిలో చర్చించుకొని వేటకు వెళ్లాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్, పోలీసు అధికారులు, ఎ.పి.స్టేట్ పిషర్ మేన్ వెల్ఫేర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, మత్స్యశాఖ జాయింట్ డైరక్టర్ లక్ష్మణరావు, మత్స్యశాఖ జిల్లా అధికారి గోవిందరావు, పోర్టు ట్రస్ట్ అధికారులు, వివిధ మత్స్యశాఖ సంఘాల ప్రతి నిధులు పాల్గొన్నారు.

# రోడ్ ను త్వరితగతిన పూర్తి చేయాలి

## సీసీ రోడ్ శంకుస్థాపన చేసిన స్పీకర్ తమ్మినేని సీతారాం



**ఆమదాలవలస** : ఆముదా లవలస మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డు బోడ్డేపల్లి పేట వద్ద సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం మున్సిపాలిటీ పరిధిలోని బొడ్డేపల్లి పేట నుండి పూజారిపేటకు వెళ్లే రహదారి సుమారు 69.50 లక్షల వ్యయంతో నిర్మాణం తలపెట్టిన కాలువలతో కూడిన సి సి రోడ్డు కు బుధవారం స్పీకర్ తమ్మినేని సీతారాం శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ కాలువలలో కూడిన రోడ్ ను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ పద్మావతి, మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఆలయ అర్చకులు రేజేటి రామజోగారావు కు ఘన సన్మానం



సబ్బవరం (విజయభాను న్యూస్) : మండల కేంద్రంలోని స్థానిక జోడుగుళ్ళు వినాయక గుడి ఆలయ అర్చకులు రేజేటి రామజోగారావు కు ఘనంగా సన్మానం చేసారు. ఆలయ ధర్మకర్త మాజీ సర్పంచ్ మండల సముద్రం పెదనాయుడు పాలెం గ్రామ పెద్దలు ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, కర్రి సత్య నారాయణ ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో ఆలయ అర్చకుల రేజేటి రామజోగారావు పంతులు కు దుశ్శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. గత 30 సంవత్సరాలుగా రామ జోగారావు పంతులు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా అర్చకులకు గ్రామస్తులు 50 వేల 116రూపాయల నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమములో గ్రామస్తులు గండి అప్పారావు, గండి కనకరాజు, గండి రమణ, సింగంపల్లి సోమునాయుడు, ముర్రి కనకరాజు, ముర్రి లక్ష్మణ జి.డి.బాబు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అన్నదానం



విశాఖపట్నం (విజయభాను న్యూస్): జగదాంబజంక్షన్ సమీపంలోని శ్రీ శ్రీ శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న కల్యాణోత్సవం వేడుకలు బుధవారంతో ముగిసాయి. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం దేవస్థానంలో అన్నసంతర్పణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు.దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ శాంతి కాలింగిరి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త బాదంపూడి సూర్యకాంతం, మేనేజర్ అడపా దేవుళ్ళు,ప్రధాన అర్చకులు రమేష్ అప్పాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది శఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని విశేష పూజల్లో పాల్గొన్నారు.

## అంధ బాలికల పాఠశాలలో

## 1 నుంచి 10 వ తరగతులలో ప్రవేశం కొరకు ప్రచార సామగ్రి అందజేత




బీమునిపట్నం (విజయభాను న్యూస్) : విశాఖ,ప్రభుత్వ అంధ బాలికల పాఠశాల 2022-23 సంవత్సరంనకు 1నుంచి 10 వ తరగతులలో ప్రవేశం కొరకు ప్రత్యేకంగా రూపొందించిన ప్రచార సామగ్రిని చిప్పాడ దివీస్ లేబరేటరీస్ సామాజిక బాధ్యత అధికారి ఇ.ఎస్ నాగరాజు పాఠశాల ప్రిన్సిపాల్ మీరు మహేశ్వరరెడ్డికి అందజేశారు. ఈ ప్రచార సామా గ్రిని విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల మండల కేంద్రాలలో ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను గ్రామాల సచి వాలయాల ద్వారా గ్రామంలో ప్రజలకు తెలియపరచనున్నట్లు చెప్పారు. సహకారం అందిం చిన దివీస్ లేబరేటరీస్ సంస్థ వారికి ప్రిన్సిపాల్ మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## ఎస్సీ విద్యుత్ సబ్సిడీ ఎత్తేసిన

# ప్రభుత్వం గందరగోళంలో వినియోగదారులు

భీమునిపట్నం (విజయభాను న్యూస్): మారుతున్న పరిస్థితులనుబట్టి ప్రజా సంక్షేమం కోసం ఆయా వర్గాల ప్రజలకు లబ్ది చేకూర్చేవిధంగా పెట్టిన పథకాలకు మంగళం పాడి వినియోగ దారులకు కన్నీళ్లు తెప్పిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, గంటా నూకరాజు అన్నారు.

స్థానిక టీడీపీ కార్యాలయంలో గంటా నూకరాజు మాట్లాడుతూ విద్యుత్ బిల్లు 200 యూనిట్లు లోపు వాడిన ఎస్సీ కుటుంబాలకు విద్యుత్ బిల్లును మినహాయిస్తూ గత ప్రభుత్వం నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఈ పథకం ద్వారా పేద ఎస్సీ లబ్ధి దారులు ఎంతో లబ్ది పొందారని అన్నారు ఈవిధంగా విద్యుత్ సబ్సిడీ మినహాయింపు భారాన్ని ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నుండి రాష్ట్ర ప్రభుత్వం ఈ మొత్తాన్ని జమ చేసుకుంటుందని గంటా నూకరాజు గుర్తుచేశారు ఇప్పటివరకు ఎస్సీ కుటుంబాలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ బిల్లు వస్తే ఎటువంటి ఛార్జీలు ఉండేవి కాదని అన్నారు ఒక ఇంటికి రెండు, మూడు మీటర్లు ఉన్నా ఈ పథకం వర్తించేదని, ఆవిధంగా రూపకల్పన చేశారని చెప్పారు అయితే 3 నెలల క్రితం ఒక ఆధార్ కార్డుకు ఒక మీటరు అని చెప్పి కొన్ని మీటర్లకు అధికారులు కోత విధించారని అన్నారు అంతే కాకుండా ఈనెల నుండి మరో కొత్త రూల్ తెర మీదకు తెచ్చారు అధికారులు మాల పల్లెలు,మాదిగ పల్లెల్లో నివాసం ఉన్నవారికి మాత్రమే 200 యూనిట్లలోపు సబ్సిడీ వర్తిస్తుందని బయట ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి ఈ పథకం వర్తించదని చెప్పడం రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గాలను ఏ విధంగా మోసం చేస్తుందో తెలుస్తుందని గంటా నూక రాజు దుయ్యబట్టారు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడం కోసం డొంకతిరుగుడు నియమాలు పెట్టి సామాన్యుల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా ఎప్పటినుండో అమలులో ఉన్న పథకాలకు చరమగీతం పాడే మాస్టర్ ప్లానే ఈ నిర్ణయమని అన్నారు. తక్షణమే 200 యూనిట్ల లోపు విద్యుత్ సబ్సిడీ పథకాన్ని కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గంటా నూకరాజు డిమాండ్ చేశారు.

# మహాకవి శ్రీశ్రీ 39వ సంస్మరణ కార్యక్రమం




విశాఖపట్నం (విజయభాను న్యూస్): మహాకవి శ్రీశ్రీ 39వ సంస్మరణ కార్యక్రమం ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (AIDSO) నిర్వహణలో బీచ్ రోడ్డులోని శ్రీశ్రీ విగ్రహం వద్ద జరిగింది.

ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటి రాష్ట్ర కార్యదర్శి ఎస్.గోవింద రాజులు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు సత్యవతి, ఏఐడిఎస్ఓ నగర అధ్యక్షులు డి.ఫనీంద్ర కుమార్ ప్రసంగించారు.

ఏఐడిఎస్ఓ విశాఖ నగర కార్యదర్శి కె.అభిలాష్, శ్రీశ్రీ అభి మానులు రామప్రభు, విజ్ఞానంద్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన ఏయూ విద్యార్థులు

## విద్యార్థులను అభినందించిన వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి తదితరులు

ఏయూ (విజయభాను న్యూస్) : ఆంధ్రవిశ్వ విద్యాలయం విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపారు. ఇటీవల ది సెంటర్ ఫర్ అడ్వాన్సడ్-అప్లయిడ్ బయోలాజికల్ సైన్స్-ఎంటర్‌ప్యూనర్‌షిప్(టికాబ్స్-ఇ) సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఏయూకు చెందిన నలుగురు విద్యార్థులు అర్హత సాదించారు. ఏయూకు చెందిన కె.అయ్యప్ప, ఐ.శ్రీ విద్య, టి.రమ్య, జి.దివ్యశ్రీలు లాబరేటరీ ట్రైనింగ్ ఇన్ ఇంటర్‌డిసిప్లీనరీ సైన్స్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు.

వీరితో పాటు టికాబ్స్-ఇ లో 20 మంది ఏయూలోని పీజీ చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు చేసే అవకాశం కల్పించారు. 10 విభాగాలకు చెందిన ఈ విద్యార్థులు 50కిపైగా టికాబ్స్-ఇ నిర్వహిస్తున్న ప్రాజెక్టుల్లో పనిచేస్తున్నారు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించి, పరిశోధన రంగం దిశగా నడిపస్తున్న టికాబ్స్-ఇ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ యేడిది రవికిరణ్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అభినందించారు. వెలకట్టలేని విలువైన సేవలు అందిస్తున్న డాక్టర్ రవికిరణ్ బృందాన్ని అభినందించారు. గత ఏడాది ఏయూ జువాలజీ విభాగంలో తమ సంస్థకు సంబంధించిన అనుబంధ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఏయూ అందించిన సహకారంతో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లను కల్పించడం సాధ్యపడుతోందని డాక్టర్ రవికిరణ్ అన్నారు. గత రెండు దశాబ్దాలుగా తమ సంస్థ బయోమెడికల్ రీసెర్చ్ రంగంలో పనిచేస్తోందన్నారు. ఇటీవల ఏయూ విద్యార్థిచే ఒక పేటెంట్‌కు దరఖాస్తు చేసామని, మరో నాలుగు పేటెంట్‌లు దరఖాస్తు చేయడానికి సిద్ధమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణ మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో

## బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కేతినేని సురేంద్రమోహన్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కేతినేని సురేంద్రమోహన్ పత్రికా విలేఖరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేంద్ర మోహన్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ 8 సంవత్సరాల పాలనలో అనేక పథకాలను ప్రజలకు అందించారని, ముఖ్యంగా యువతకు, ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల పేద విద్యార్థులకు మేలు చేకూరే విధంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ను అమలు చేసారని అన్నారు. ఇప్పుడు ఒక అద్భుతమైనటువంటి అగ్నిపథ్ అనే పథకాన్ని ప్రవేశపెట్టి పదిహేడున్నర నుండి 21 సంవత్సరాల మధ్య ఉన్న యువకులకు త్రివిధ సాయుధ దళాల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టేలా కొత్త విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, అగ్నిపథ్ రిక్రూట్మెంట్ పాలసీ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు నాలుగేళ్లపాటు శిక్షణ ఇస్తారని, ఈ శిక్షణ కాలంలో వీరికి 30 వేల రూపాయల జీతాన్ని కూడా అందిస్తారని, ఆ తరువాత వారిలో 25 శాతం మందిని పూర్తి స్థాయి సర్వీసులో కొనసాగిస్తారని అన్నారు. మిగిలిన వారికి అగ్నివీర్ సర్టిఫికెట్ తో పాటు 11 లక్షల రూపాయలను అందజేస్తారని తెలిపారు. అగ్నివీర్ సర్టిఫికెట్ తో వారు సుమారు 18 లక్షల రూపాయల వరకు బ్యాంకు లోన్ పొందే సౌకర్యం కూడా వారికి నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందని, ఆ తరువాత వారు ఏ ఉద్యోగంలోనైనా చేరవచ్చని అన్నారు. ఈ పథకం యువతకు గొప్ప సదావకాశంగా తీసుకొని దేశ రక్షణలో భాగస్వాములు కావాలని సురేంద్ర మోహన్ కోరుతూ, దేశ రక్షణ శాఖా మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. బిజెపి విశాఖపట్నం పార్లమెంటు జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి మాట్లాడుతూ 2014వ సంవత్సరంలో వచ్చిన హుదూద్ తుఫాన్ కారణంగా అనేక వేల చెట్లు నేలకొరిగి పచ్చదనం కనుమరుగైన సందర్భంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మరియు అనేక స్వచ్ఛంద సంస్థలు యుద్ధ ప్రాతిపదికన కొన్ని లక్షల మొక్కలను మరియు కొద్దిపాటిగా పెరిగిన చెట్లను విశాఖ నగరం అంతటా నాటడం జరిగింది. అయితే దురదృష్టవశాత్తు సుమారుగా 50 నుంచి 60 వేలు వరకు ఏడాకుల మొక్కలను వేయడం జరిగిందని, బహుశా అప్పటి ప్రభుత్వం కానీ, స్వచ్ఛంద సంస్థలు కానీ నగరంలో పచ్చదనం త్వరితగతిన పరిఢవిల్లాలనే ఉద్దేశంతో ఈ మొక్కలను వేసి ఉండొచ్చని అన్నారు. దురదృష్టవశాత్తు ఈ మొక్కల పూర్వాపరాలు తెలియకుండా వేసినందువలన ఇప్పుడు అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందని, ఈ మొక్కల పూల నుండి వచ్చే పుప్పొడి వలన ప్రజలకు వికారం, తలనొప్పి, ఊపిరితిత్తుల సమస్యలు, అనేక రకాలైన శ్వాసకోస రుగ్మతలకు గురి కావలసి వస్తుందని అన్నారు.

అనేక ఔషధ గుణాలు కలిగిన ఈ మొక్కలను జనావాసాల్లో కాకుండా ప్రత్యేకమైన ప్రాంతాలలోనే పెంచాలని అన్నారు.గతంలో జివిఎంసి కమిషనర్ కు ఈ చెట్లను తొలగించి ప్రకృతికి ఉపయోగపడే మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశామని, అప్పుడు వారు కొన్ని మొక్కలను తొలగించి, మిగిలిన మొక్కలను పూర్తిగా తొలగించడం తమకు సాధ్యం కాదని చేతులెత్తేశారని అన్నారు.కనుక ప్రజలే స్వతహాగా ముందుకు వచ్చి ప్రస్తుతం వర్షాకాలం మొదలవుతున్న సమయం కాబట్టి ఏడాకుల మొక్కలను తొలగించి వాటి స్థానంలో వేరే మొక్కలను నాటాలని రవీంద్ర పిలుపునిచ్చారు.

# మినీ మహానాడుకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : చోడవరంలో జరిగిన మినీ మహానాడుకు బుధవారం మండలంలో పలు గ్రామాల నుండి తెలుగు తమ్ముళ్లు తరలి వెళ్లారు. ఎలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ ప్రజా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో వాహనాల్లో తెలుగు తమ్ముళ్లు మినీ మహానాడుకు తరలి వెళ్లారు.

# విజయభాను సంపాదకీయం

## పెనుసవాలుగా పర్యావరణం

వ్యవసాయం-పర్యావరణ యూనిట్‌గా స్థానిక సాంకేతిక పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆహార, పోషక వ్యవస్థల్లో నష్టాలను నివారించాలి. పంటల మార్పిడి, జీవ సేంద్రియ ఎరువులు, జీవ నియంత్రణ పద్ధతులు, పర్యావరణ వ్యవస్థతో ఇమిడ్చి, ఆధునికతను జోడించడం ద్వారా వ్యవసాయాన్ని సుస్థిరపరుచాలి. భూమి ఆరోగ్య పరిరక్షణ, నీటి సంరక్షణ, భూసారం పెంపొందింపు, నేల కోతను నివారించటం ద్వారా ఉత్పాదకతను పెంచడం దీర్ఘకాలిక లక్ష్యంగా ఎంచుకోవాలి. పర్యావరణ మార్పులను ఎదుర్కొనేందుకు కేవలం భారత్ అనుకుంటేనే కాదు, స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమగ్ర కార్యాచరణ అవసరం. కోపెన్ హాగెన్ సదస్సులో నిర్ణయించినట్లుగా ఉద్గారాలను తగ్గించటం ద్వారా ఉష్ణోగ్రత పెరుగకుండా భారత్ కృషిచేయాలి. పర్యావరణ మార్పులకు అనుకూల విధానాలను రూపొందించుకుంటూనే, అభివృద్ధి చెందిన దేశాలు కార్బన్ ఉద్గారాల విడుదలకు మూల్యం చెల్లించేవిధంగా ఒత్తిడి తెస్తేనే పర్యావరణం పరిరక్షించబడుతుంది. పర్యావరణ మార్పులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఫలితంగా ఆహారభద్రతపై నీలినీడలు అలుముకున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటికే యుద్ధ ప్రాతిపదికన హరితహారంతో మొక్కలు వనాల పెంపకం చేపట్టింది. అనావృష్టిని ఎదుర్కొనేందుకు చెరువుల పునరుద్ధరణ దాదా పు పూర్తయ్యింది. పంటల వైవిధ్యీకరణకు బాటలువేసింది. దీంతో పర్యావరణ మార్పు లు విపరీతంగా చోటు చేసుకున్న ప్పటికీ, సాగును సజావు గా సాగించేందుకు సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నది. ఒక్క మాట లో చెప్పాలంటే, పర్యావరణ మార్పులను తట్టుకునేందుకు, తెలంగాణ ప్రభుత్వం ముందస్తుగానే తయారైందని తెలుస్తున్నది. వాతావరణ మార్పులతో అభివృద్ధి దేశాల్లో ఆహారధా న్యాల ఉత్పత్తి తరిగిపోతున్నది. మరో రెండు సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత పెరిగి తే దేశంలో ప్రధాన ఆహారపంట వరి ఉత్పాదకత హెక్టారుకు ఒక టన్ను తగ్గిపోనున్నది. 2050 నాటికీ ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగినా, దేశంలో మరో ప్రధాన ఆహారపంట గోధుమ ఉత్పాదకత తగ్గిపోతుంది. సాగుకు అనుకూల భూమి తగ్గిపోనున్నది. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటరకాలు సాగుకు పనికిరావు. ఏడాదికి ఒక్క మన దేశంలోనే దాదాపు 70 లక్షల టన్నుల మేర ఉత్పత్తి పడిపోనున్నది. దీనికితోడు ఆకస్మిక వరదలు, వర్షాల లేమి సంభవించనున్నాయి. 2009లో సంభవించిన అననుకూల వర్షాభావ పరిస్థితుల వల్ల, ఒక కోటి 50 లక్షల టన్నుల వరి, 40 లక్షల టన్నుల ఇతర ఉత్పత్తి పడిపోయింది. పర్యావరణ మార్పుల వల్ల, అసాధారణ పరిస్థితులు భారత వ్యవసాయంలో చోటుచేసు కుంటున్నాయి. అసాధారణ వాతావరణ పరిస్థితులున్న దేశాల్లో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్నది. ఒక్క 2015లోనే దేశంలో 15 రాష్ట్రాలు వీటి ప్రభావాన పడితే, దాదాపు 33 శాతం పంటల సాగు విస్తీర్ణం దెబ్బతిన్న ది. ఇరువై వేల కోట్ల రూపాయల పైనే రైతులు నష్టపోయారు. పంటల బీమా లాంటి పథకాలతో ఆదుకుంటే తప్ప, రైతు సాగులో నిలబడలేరని భారత హరితవిప్లవ పితామహులు స్వామినాథన్ గుర్తుచేయాల్సి వచ్చిం ది. ఇది దేశ ఆహారభద్రతకు ప్రత్యక్ష హెచ్చరిక. ఎంత త్వరగా పరిష్కారం వెతికితే, అంత త్వరగా దేశం, ఆహార భవిష్యత్తు భద్రంగా ఉంటుంది. తెలుగు రాష్ట్రాలకు మరిన్ని పర్యావరణ సవాళ్లు పొంచి ఉన్నట్లు ప్రపం చబ్యాంకు షాక్ వేవ్స్' నివేదిక తెలుపుతున్నది. పర్యావరణ మార్పుల ప్రభావాన్ని గత 25 ఏండ్లలో అధ్యయనంలో 14 శాతం ప్రజలు పేదరి కం నుంచి బయటపడితే, ఏడాదికి సరాసరిన 12 శాతం ప్రజలు మళ్లీ పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారు. ఎండల తీవ్రత, వర్షాల లేమి వల్ల, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత 25 ఏండ్లలో 15 వేల మందికి పైగా పేదలు చనిపోయారు. ప్రపంచంలో సూడాన్ దేశం తర్వాత, అత్యధిక మరణాలు జరిగినయి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే. 2030 నాటికీ ఐదు శాతం మేర ఆహారధాన్యాల ఉత్పత్తి పడిపోతుంది. దీంతో పేదరికం పెరుగనున్నది. 2030 నాటికీ పేదరిక నిర్మూలన చర్యలు చేపట్టకపోతే, పేదరికం 30 శాతానికి చేరుకోనున్నది. కరువు, నీటికొరత, తద్వారా పంట నష్టాల వల్ల పంటల దిగుబడులు తగ్గి ఆహారకొరత పెరగనున్నదని నివేదిక తెలిపింది.

## విపక్ష నేతలకు రాజ్‌నాథ్ సింగ్ ఫోన్.. మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి



న్యూఢిల్లీ: రాష్ట్రపతి అభ్యర్థి విషయంలో ఏకమై విపక్షాలన్నీ ఒక పేరు ప్రకటించేందుకు జోరుగా చర్చలు జరుపుతున్నాయి. ఇవాళ(బుధవారం) తొలి దశ భేటీ తర్వాత.. త్వరలో మరోసారి భేటీ కానున్నాయి. ఈ తరుణంలో.. బీజేపీ మాత్రం తన ప్రయత్నాలు మానడం లేదు. ఎన్డీయే అభ్యర్థికి ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించాలంటూ బీజేపీ సీనియర్ నేత రాజ్‌నాథ్ సింగ్.. ప్రతిపక్షాలకు ఫోన్ చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గేతో ఫోన్‌లో సంప్రదించిన రాజ్‌నాథ్.. సాయంత్రం మమతా బెనర్జీ, అఖిలేష్‌యాదవ్‌తోపాటు మరికొందరితోనూ ఫోన్‌లో మాట్లాడారు. అయితే ఆయన ప్రయత్నాలు ఫలించడం మాత్రం కష్టంగా కనిపిస్తోంది. పైగా ఫోన్‌లోనూ ఆయనకు వ్యతిరేక ఫలితం ఎదురైనట్లు జాతీయ మీడియాలు కథనాలు ప్రచురిస్తున్నాయి. ఇక.. ఎన్నికల బరిలో ఓ అభ్యర్థిని ప్రకటించాలని ఇప్పటికే విపక్షాలు బలంగా ఉన్నాయి. శరద్ పవార్ రేసు నుంచి తప్పుకోవడంతో.. ఫరూఖ్ అబ్దుల్లా, గోపాలకృష్ణ గాంధీ పేర్లను పరిశీలనలో ఉంచాయి విపక్షాలు. మరోవైపు రాష్ట్రపతి అభ్యర్థి విషయంలో తమ అభిప్రాయంపై విపక్షాల భేటీలో స్పష్టత ఇవ్వని కాంగ్రెస్ పార్టీ.. సోనియా కోలుకున్నాక మల్లికార్జున ఖర్గే భేటీ అయ్యి.. ఒక స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. ఇక బీజేపీ పార్లమెంటరీ బోర్డు కూడా సమావేశమై ప్రధాని నరేంద్ర మోదీ జర్మనీ పర్యటనకు ముందే రాష్ట్రపతి అభ్యర్థి పేరును ఖరారు చేసి ప్రకటించనున్నారు.

## మూడోరోజు ఈడీ విచారణకు రాహుల్..

### మేమంటే భయం ఎందుకంటున్న నిరసనకారులు..



దిల్లీ: నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో విచారణ ఎదుర్కొంటోన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మూడోరోజు ఈడీ కార్యాలయానికి వెళ్లారు. బుధవారం ఉదయం ఆయన కార్యాలయానికి చేరుకున్నారు. మరోపక్క తమ నేతపై కేంద్రం తీసుకుంటోన్న చర్యలను ఖండిస్తూ..పార్టీ నేతలు, కార్యకర్తలు తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. సోమవారం నుంచి ఈ నిరసనలు కొనసాగుతున్నాయి. కాగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకూడదనే ఉద్దేశంతో పోలీసులు వారిని ఎక్కడికక్కడే నిలువరిస్తున్నారు. దిల్లీలోని కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో నిరసన తెలుపుతోన్న వారిని అదుపులోకి తీసుకొని.. బస్సుల్లోకి ఎక్కించారు. మరోపక్క ఈడీ కార్యాలయం చుట్టూ 144 సెక్షన్ విధించారు. 'మేము ఉగ్రవాదులమా ఏంటి? మమ్మల్ని చూసి ఎందుకు భయపడుతున్నారు? నేతలు, కార్యకర్తలపై పోలీసుల్ని ఎందుకు ప్రయోగిస్తున్నారు. అంటూ ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత అధిర్ రంజన్ చౌధరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈడీ విచారణ సమయంలో మినహా కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ.. రాహుల్ వెంటే ఉంటున్నారు. మరోపక్క ఈ రెండ్రోజుల వ్యవధిలో ఈడీ

## శుభవార్త చెప్పిన చైనా.. భారతీయులకు వీసాలు



బీజింగ్: చైనాలో పనిచేస్తూ స్వదేశంలో ఉండిపోయిన భారతీయులు, వారి కుటుంబీకులకు బీజింగ్ ప్రభుత్వం ఎట్టకేలకు శుభవార్త చెప్పింది. కరోనా కారణంగా భారత్‌లో ఉండిపోయిన అక్కడ పనిచేసేవారికి వీసాలను పునరుద్ధరించే ప్రణాళికలను ప్రకటించింది. చైనాలోని అన్ని రంగాల్లో పనిచేసేవారు, వారి కుటుంబసభ్యులు తిరిగి చైనాకు వెళ్లాలనుకువారి వీసా దరఖాస్తులను ఆమోదిస్తున్నట్లు భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం వెల్లడించింది. తాజా నిర్ణయంతో గత రెండేళ్లుగా భారత్‌లో ఉండిపోయిన వందలాది భారతీయ కుటుంబాలకు ఊరట లభించినట్లయింది. దీంతోపాటు అక్కడి విశ్వవిద్యాలయాల్లో చదువుకునే వేలాది మంది భారతీయ విద్యార్థుల అభ్యర్థననూ బీజింగ్ పరిగణలోకి తీసుకుంటున్నట్లు తెలిపింది. కరోనా కారణంగా 2020లో భారతీయ ఉద్యోగుల తోపాటు, అక్కడి యూనివర్సిటీల్లో చదువుకునే వేలాదిమంది విద్యార్థులను చైనా.. భారత్‌కు పంపించిన విషయం తెలిసిందే. అయితే రెండేళ్లు గడిచినా వారికి మళ్లీ వీసాలు మంజూరు చేయలేదు. పలు వినతులు, పరిశీలనల అనంతరం డ్రాగన్ తాజా నిర్ణయం తీసుకుంది.

## కవి సమయం

### సర్వేశ్వరుడు

ప్రభూ ! సర్వాంతర్యామి, ఈశా,
మహేశా
దీనజనోద్ధారకుడా, దయా సముద్రుడా
అడగకనే అన్నీ ఇచ్చావు
ప్రార్థన, ఆరాధన పేరుతో
కోరికల చిట్టానూ ముందు విప్పు
తున్నా
ప్రతీ క్షణం ఏదో ఒకటి నీ నుండి
ఆశిస్తున్నా
పెద్ద మనస్సుతో మమ్మల్ని క్షమిస్తునే
వున్నావు
నీ బోధలను ఒక్కటి కూడా
ఆచరించకున్నా
మమ్మల్ని కష్ట నష్టాల నుండి రక్షిస్తునే
వున్నావు
జగత్తుకే తండ్రివైన నిన్ను
విస్మరిస్తున్నా
బిడ్డలమైన మమ్మల్ని
కాపాడుతున్నావు
ఎల్లవేళలా నీ అభయ రక్షా కవచం
మాకందించి మమ్మల్ని ఒడ్డున
పడేస్తున్నా
కనీసం కృతజ్ఞత కూడా
పవిత్రమైన మనస్సుతో చెప్పని
కృతఘ్నులం మేము
కష్టాలలోనే గుర్తుంచుకునే పెద్ద
మనసూ మాది
మమ్మల్ని క్షమించి మాలో
జ్ఞానోదయం కలిగించి
సన్మార్గులను గావించు తండ్రీ


... రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : జ్యేష్ఠ; తిథి :విదియ ప.12.50; పూర్వాషాడ సా.4.09; రా.వ.11.38ల 1.08.
గురువారం 16-06-2022

a **మేషం** : ప్రముఖుల సహాయంతో ఒక సమస్య నుంచి క్షేమంగా బయటపడతారు. ఖర్చులు, చెల్లింపులు ప్రయోజనకరంగా ఉంటాయి. ఇతరుల విషయాలకు దూరంగా ఉండటం క్షేమదాయకం. రుణం ఏ కొంతైనా తీర్చాలన్న మీ సంకల్పం నెరవేరుతుంది. స్త్రీలు గృహాలంకరణ, విలాస వస్తువుల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. b **వృషభం** :పారిశ్రామిక రంగాల వారికి కార్మికులతో సత్సంబంధాలు నెలకొంటాయి. క్యాటరింగ్ పనివారలు, చేతివృత్తుల వారికి ఆశాజనకం. తరచూ వేడుకలు, శుభకార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. ఖర్చులు, చెల్లింపుల్లో ఏకాగ్రత వహించండి. విద్యార్థుల్లో ఏకాగ్రత, పట్టుదల చోటు చేసుకుంటాయి. c **మిథునం** : మీ యత్నాలు కొంత ఆలస్యంగానైనా పరిపూర్ణంగా పూర్తవుతాయి. నూతన పెట్టుబడులు, వ్యాపారాలకు అనుకూలం. చేపట్టిన పనుల్లో శ్రమాధిక్యత, ప్రయాసలు ఎదుర్కొంటారు. స్త్రీలకు బంధువుల వైఖరి నిరుత్సాహం కలిగిస్తుంది. అవివాహితులు శుభవార్తలు అందుకుంటారు. బంధువులతో మనస్పర్థలు తలెత్తుతాయి. d **కర్కాటకం** : వస్త్ర, బంగారం, వెండి, ఫ్యాన్సీ వ్యాపారులకు పురోభివృద్ధి. మిత్రుల సహకారంతో కొత్త యత్నాలు మొదలెడతారు. ఆధ్యాత్మిక విషయాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉద్యోగస్తులు పై అధికారులను మెప్పిస్తారు. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు అనుకూలిస్తాయి. స్పెక్యులేషన్ రంగాల వారికి నిరుత్సాహం తప్పదు. e **సింహం** :నిరుద్యోగులు, చేతి వృత్తుల వారికి ఆశాజనకం. వేడుకలు, శుభకార్యాల్లో అందరినీ ఆకట్టుకుంటారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. పారిశ్రామిక రంగాల వారికి ఊహించని చికాకులు ఎదురవుతాయి. ఆర్థిక లావాదేవీలు సామాన్యంగా ఉంటాయి. f **కన్య** :ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. వ్యాపారాలకు కొత్త కొత్త పథకాలు, ప్రణాళికలు రూపొందిస్తారు. దంపతుల మధ్య పలు ఆలోచనలు చోటు చేసుకుంటాయి. ధన వ్యయంలో ఏకాగ్రత వహించండి. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. ఎదురు చూడకుండానే మీకు కొత్త అవకాశాలు లభిస్తాయి. g **తుల** : ఖర్చులు, చెల్లింపుల్లో ఏకాగ్రత వహించండి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచివి కాదని గమనించండి. వస్త్ర, ఫ్యాన్సీ, మందులు, రసాయన సుగంధ ద్రవ్య వ్యాపారులకు పురోభివృద్ధి. కోర్టు వ్యవహారాలలో ప్లీడరు, ప్లీడరు గుమస్తాలకు ఊహించని చికాకులు ఎదురవుతాయి. ఖర్చులు అధికమవుతాయి. h **వృశ్చికం** :ఆలయాలను సందర్శిస్తారు. బంధువులతో తెగిపోయిన సంబంధాలు బలపడతాయి. ఆత్మీయుల కలయిక సంతోషం కలిగిస్తుంది. వ్యాపారాభివృద్ధికై చేయు కృషిలో రాణిస్తారు. రావలసిన ధనం అందటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. మీ కార్యక్రమాలు, పనులు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. **ధనుస్సు** :వ్యాపారాల విస్తరణలు, పరిశ్రమల స్థాపనలకు కావలసిన అనుమతులు మంజూరు కాగలవు. ఒక వ్యవహారం నిమిత్తం న్యాయవాదులతో సంప్రదింపుల ం జరుపుతారు. గృహంలో ఒక శుభకార్యానికి అనువైన పరిస్థితులు నెలకొంటాయి. మీ విలువైన వస్తువులు, పత్రాల విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. j **మకరం** :స్త్రీలకు బంధువుల రాక వల్ల ఒత్తిడి, పనిభారం అధికమవుతాయి. పత్రిక, ప్రైవేటు సంస్థల్లోని వారికి యాజమాన్యం తీరు ఆందోళన కలిగిస్తుంది. చేతివృత్తులు, క్యాటరింగ్ పనివారలకు సదవకాశాలు లభిస్తాయి. ఏజెన్సీ, నూతన కాంట్రాక్టుల విషయంలో పునరాలోచన అవసరం. గృహ నిర్మాణాలు, మరమ్మతులు అనుకూలిస్తాయి. k **కుంభం** :తలచిన పనుల్లో జయం లాంటి శుభ సూచకాలున్నాయి. ఎంత ధనం వెచ్చించినా కోరుకున్న వస్తువు దక్కించుకుంటారు. స్త్రీలకు నూతన పరిచయాలు, చుట్టుప్రక్కల వారి నుంచి ఆహ్వానాలు అందుతాయి. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం మంచిది. ఒక వ్యవహారం అనుకోకుండా మీకు అనుకూలిస్తుంది. L **మీనం** :ఆడిటర్లు, అకౌంట్స్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికం. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో లౌక్యం అవసరం. నూతన పెట్టుబడులు, లీజు, ఏజెన్సీలు లాభిస్తాయి.

# నర్మదా, సోన్ నదుల జన్మస్థలం అమర్‌కంటక్



## సంకీర్తన

మధ్య ప్రదేశ్ రాష్ట్రాన్ని సుభిక్షం చేస్తున్న పవిత్ర జీవ నది నర్మదా. నర్మదాతో పాటుగా సోన్ నదుల జన్మస్థలం అమర్‌కంటక్. ఉత్తర భారతాన్ని దక్షిణాది విడగొడుతున్న పర్వత సానువైన వింధ్యలోని ప్రాంతం అమర్‌కంటక్. హిందువులు పవిత్ర క్షేత్రంగా పేర్కొనే దానిలో అమర్‌కంటక్ ఒకటి. అన్ని నదులు కంటే భిన్నంగా తూర్పు నుంచి పడమరకు ప్రవహించే అతిపెద్ద నదుల్లో ఒకటి నర్మదా. ఇక్కడే ఉద్భవించిన సోన్ నది మాత్రం తూర్పు ముఖంగా ప్రవహిస్తుంది. అడవుల మధ్య ఉన్న ప్రాంతం కావడంతో పచ్చదనంతో కళకళలాడుతుంది అమర్‌కంటక్. మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌ల మీదగా 1,312 కి.మీ. మేర ప్రవహించి అరేబియా సముద్రంలో సంగమిస్తుంది. నర్మదా సంగమ ప్రాంతం గుజరాత్‌లోని భారూచ్‌కు 50 కి.మీ. దూరంలో ఉంది. మనదేశంలో ఐదో అతిపెద్ద నది నర్మదా. దేశంలోని అన్ని నదులు తూర్పు వైపుకు ప్రవహిస్తుంటే నర్మదా, తపతి, మాహిలు మాత్రం పడమర దిశగా ముందుకు సాగుతాయి. నర్మదా నది వల్ల ఎక్కువ లబ్ది పొందేది మధ్య ప్రదేశ్. నర్మదకు 41 ఉపనదులు ఉన్నాయి. సాత్పూరా పర్వత శ్రేణిలో జన్మించినవి 22 నదులు కాగా, మిగిలిన 19 నదులు వింధ్య లోవి. భారతదేశం లోని పవిత్ర పంచ జీవ నదుల్లో నర్మద ఒకటి. మిగిలినవి గంగా, యమునా, గోదావరి, కావేరి. విష్ణు పాదోద్భవి అయిన పవిత్ర గంగానదిలో ప్రతి ఏడాది కోట్లాది జీవరాశులు స్నానం చేయటంవల్ల అపరిశుభ్రం అవుతుంది. గంగా మాత తిరిగి పవిత్రంగా మారాలంటే నర్మదలో స్నానం చేయమని పరమ శివుడు ఆమెను ఆదేశించాడు. నర్మదా నది పవిత్రత, ప్రాముఖ్యత గురించి రామాయణం, మహాభారతాలతో పాటుగా వాయు, స్కంధ పురాణాల్లో వివరించారు.

### ప్రముఖ పుణ్యక్షేత్రాలు

### అమర్‌కంటక్

నర్మదా నది జన్మించిన ప్రాంతం అమర్‌కంటక్. వింధ్యా-సాత్పూరా పర్వత శ్రేణులను కలిపే మైకాల్ పర్వతాల్లోని ప్రాంతం అమర్‌కంటక్. ఈ ప్రాంతం సముద్రమట్టానికి 1067 మీటర్లు ఎత్తున ఉంది. ఇక్కడ ఉన్నటువంటి నర్మదా నది దేవాలయాన్ని నాగపూర్ భోన్స్‌లే రాజులు నిర్మించారు. బాఘేల్, కల్చూరీ వంశ రాజులు అమర్‌కంటక్‌లో అనేక దేవాలయాలు నిర్మించారు.

### ఓంకారేశ్వర్

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటి ఓంకారేశ్వర్. ఇక్కడ వెలసిన శివుడు పేరు ఓంకారేశ్వరుడు.

### మహేశ్వర్

దక్షిణ అవంతి రాజ్య పరిధిలోని ప్రాంతం మహిషసతి. మహాభారతం, రామాయణంలలో దీని గురించి ప్రస్తావన ఉంది. ఇక్కడి దేవుడి పేరు మహేశ్వరుడు. మహిషసతిని ప్రస్తుతం మహేశ్వర్‌గా పిలుస్తున్నారు.

### ఎలా చేరుకోవాలి

విమాన మార్గం : జబల్‌పూర్ (228 కి.మీ.), రాయ్‌పూర్ (230 కి.మీ.) సమీపంలోని విమానాశ్రయాలు.

రైలు మార్గం : పెండ్రా రోడ్ సమీపంలోని రైల్వే స్టేషన్. అమర్‌కంటక్ నుంచి 42 కి.మీ. దూరంలో ఉంది పెండ్రా రోడ్. కత్ని-బిలాస్‌పూర్ మార్గంలో ఉంది పెండ్రా రైల్వే స్టేషన్.

రహదారి మార్గం : జబల్‌పూర్ (228 కి.మీ.), రాయ్‌పూర్ (230 కి.మీ).

# ఘనంగా శ్రీ సీతారామాలయం శ్రీకృష్ణ వినాయక ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం



భీమునిపట్నం (విజయభాను న్యూస్): భీమిలీ మండలం, లక్ష్మీ పురం గ్రామ పంచాయితీ, విజయ రామపురం గ్రామంలో శ్రీ సీతా రామాలయం శ్రీ కృష్ణ వినా యక ఆలయం ప్రతిష్ఠ మహో త్సవం కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. శ్రీ స్వామివారికి మూడు రోజులు నుండి శాస్త్రోక్తంగా పూజలు నిర్వ హించారు. అనం తరం శ్రీ స్వామి వారి కల్యాణ మహోత్సవ కార్య క్రమము నిర్వహించారు. తదుపరి భారీ అన్న సమరాధన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో విశాఖ పట్నం జిల్లా పశుగణాభివృద్ధి సంగం చైర్మన్ గాడు వెంకటప్పుడు, విశాఖపట్నం జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పెదబాబు, భీమునిపట్నం మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోని బంగారునాయుడు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# సైబర్ సేఫ్టీపై విద్యార్థులకు పోటీల నిర్వహణ

## ఉత్సాహంగా పాల్గొన్న కళాశాలల విద్యార్థులు




ఆంధ్రాయూనివర్శిటీ (విజయభాను న్యూస్) : ఆజాదీకా అమృత్ మహోత్స వాలలో భాగంగా భారత హోం మంత్రిత్వ శాఖ, ఏపీ పోలీస్ శాఖ సంయుక్తంగా 'సైబర్ సేఫ్టీ-నేషనల్ సెక్యూరిటీ' అంశంపై నిర్వహిస్తున్న వివిధ పోటీలకు ఏయూ సాంకేతిక సహకారాన్ని అందించింది. బుధవారం ఏయూ కంప్యూటర్ సైన్స్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం వేదికగా విద్యార్థులకు డిజిటల్ పోస్టర్ ప్రెజెంటేషన్, టాగ్‌లైన్ ప్రెజెంటేషన్, స్లోగన్, క్విజ్ కాంపిటేషన్‌లను నిర్వహించారు. ఏయూ పాలక మండలి సభ్యులు ఆచార్య జేమ్స్ స్టీఫెన్ సమన్వయకర్తగా వ్యవహరించి ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించారు. పోటీలలో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. సైబర్ బధ్రత-సైబర్ నేరాల నియంత్రణ అంశంపై పోస్టర్ ప్రెజెంటేషన్, సైబర్ బధ్రత-జాతీయ బధ్రత అంశంపై టాగ్‌లైన్ ప్రజెంటేషన్, సైబర్ హైజీన్, సైబర్ సేఫ్టీ, నేషనల్ సెక్యూరిటీ అంశంపై స్లోగన్ కాంపిటీషన్, సైబర్ సెక్యూరిటీలో ప్రగతి-నూతన విధానాలు అంశంపై క్విజ్ పోటీలను నిర్వహించారు.

పోటీలలో విజేతలకు గురువారం నిర్వహించే కార్యక్రమంలో బహుమతులను ప్రధానం చేస్తారు. పోటీలను ఏడిసిపి ఆనందరెడ్డి ఉదయం సందర్శించారు.








# ఆరోగ్యంపై జివిఎంసి ఉద్యోగులకు అవగాహన




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : అన్ని రోగాలకు కారణం మన ఆలోచనా విధానంలోమార్పు రావాలని డాక్టర్ ఎబిఎంకె వరప్రసాద్ తెలిపారు. బుధవారం జివిఎంసికమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ జోన్-4 కార్యాలయంలో జివిఎంసి ఉద్యోగులకు డాక్టర్ ఎబిఎంకె వరప్రసాద్ తో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగులు శాఖాపరంగా ఎంతో ఒత్తిడి తోఉంటారని, వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, అందుకు వైద్యంలోనిపుణులైన డాక్టర్ ఎబిఎంకె వరప్రసాద్ తో ప్రత్యేకంగా అవగాహనకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డాక్టర్ సలహాలను తూ.చ. తప్పకుండపాటించాలని సూచించారు. అడిగిన వెంటనే ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకుముందుకు వచ్చినందుకు డాక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. మరో మారు మిగి లినఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు అవకాసం ఇవ్వాలని తెలిపారు. అనంతరం డాక్టర్ ఎబిఎంకె వరప్రసాద్ మాట్లాడుతూ అన్ని రోగాలకుకారణం మన ఆలోచనా విధానమే అని, ముఖ్యంగా ఎటువంటి వైద్యం లేకుండానేఅనేక రోగాలను నయం చేసుకోవచ్చని తెలిపారు.

ముఖ్యంగా దీర్ఘకాలంగా వున్నా రోగాలను కూడా మనం ఆహారనియమాలు, నిద్ర, ఒత్తిడి. సరైనవ్యాయామం, త్రాగు నీరు, స్వచ్ఛ మైన గాలి మొదలైన వాటితో ఎటువంటిరోగామైనా దూరం చేయ వచ్చునని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, స్వచ్ఛవిశాఖ అంబాసిడర్ డాక్టర్ ఎస్. విజయ కుమార్, అదనపు కమిషనర్ ఎ.వి. రమణి,ఎస్. ఎస్. వర్మ, ప్రధాన వైద్యాధికారి కెఎస్ఎల్ జి శాస్త్రి, ప్రధానఇంజనీరు రవికృష్ణ రాజు, డి.సి.(రెవెన్యూ) పి. నల్లనయ్య, జోనల కమిషనర్ బిరాము, ఎఫ్.ఎ. ఎ.ఓ. మల్లికాంబ, డి.పి.ఒ. చంద్రిక, సెక్రటరి ఫణిరాం, ఇతరఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# లెవిన్స్టాస్ ఉపాధ్యక్షులుగా అమిషా జైన్

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వ్యాపార రంగంలో తనకున్న విశిష్టమైన అనుభవం ద్వారా ఎన్నో విజయవంతమైన ప్రాజెక్టులను విజయవంతంగా ముందుకు నడిపించిన అమిషాజైన్ లివీస్ట్రాస్ అండ్ కో సీనియర్ ఉపాధ్యక్షులుగా నియమితు లయ్యారు. అమిత్ షా జైన్ కు ఉన్న అపార అనుభవం దృష్ట్యా ఆమెను దక్షిణాసియా, మధ్య ప్రాచ్యం ఆఫ్రికా ప్రాంతాలకు కొత్త సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎంపిక చేసినట్లు లెవిస్ట్రాస్ అండ్ కో అధికార ప్రతినిధి వెల్లడించారు.

దక్షిణాసియా, మధ్య ప్రాచ్యం ఆఫ్రికా ప్రాంతాలకు ఎస్ఏ ఎంఈఏ లో కంపెనీ కార్యకలాపాలను మరింత విజయవంతంగా నడిపించేందుకు అమిషా జైన్‌ను నియమించామని ఆసియాలో ప్రపంచవ్యాప్తంగా కంపెనీ అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్ణయాలు, అలాగే ఆయా ప్రాంతాల్లో తీసుకోవాల్సిన నిర్ణయాత్మక విధి విధానాలకు ఇకనుంచి ఆమె బాధ్యత వహిస్తారని చెప్పారు.

# మూలకుద్దు ప్రజల నీటి ఇక్కట్లు

భీమునిపట్నం(విజయభాను న్యూస్) : భీమిలి మండలం, కొత్త మూల కొద్దు గ్రామంలో త్రాగునీరు కోసం ప్రజల 45 రోజుల నుండి మూల కొద్దు గ్రామ ప్రజలు నీరు లేక ట్యాంకర్ల ద్వారా డబ్బులు ఇచ్చి కొనుక్కుని నానా ఇబ్బందులు పడు తున్నారనీ ఇన్ని రోజుల నుండి నీరు లేక ప్రజలు ఇబ్బంది పడు అధికారులు చోద్యం చూస్తున్నారనీ సిపిఎం నాయకులు చెప్పారు. జనం కోసం సిపిఎం ఇంటింటి కార్యక్రమం లో మాల కొద్దు గ్రామంలో సిపిఎం బృందం పర్యటించినప్పుడు ఇక్కడ ప్రజలు సిపిఎం బృందానికి తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రవ్వ నర్సింగరావు, సిహెచ్ అప్పారావు చిట్టి బాబు మాట్లాడుతూ మూల కొద్దు గ్రామంలో మంచినీటి సమస్య వెంటనే పరిష్కారం చేయాలని, లేకపోతే 20న సచివాలయం ముట్టడిస్తామని 21 న ఎండిఓ ఆఫీసు ముట్టడిస్తామని అధికారులను హెచ్చరించారు. ఎన్నో గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం మాల కొద్దు మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారం చూపించలేక పోతుందని అన్నారు.

# ఎర్నిమాంబ అమ్మవారి హుండీల లెక్కింపు

విశాఖపట్నం(విజయభాను న్యూస్) : జ్ఞానాపురంలోని శ్రీ ఎర్ని మాంబ అమ్మవారి ఆలయ హుండీలను బుధవారం లెక్కించారు. హుండీల ద్వారా ద్వారా 70.600,గ్రాముల బంగారం,11.860 గ్రాముల వెండి లభించింది.మే 30నుండి జూన్ 15వరకు 16 రోజులకు గాను రూ.4,85,392 నగదు హుండీ ద్వారా లభించింది.

ఈ కార్యక్రమంలో...

ఏసీ కార్యాలయం పర్యవేక్షకులు జి.గోవిందు మరియు గ్రామస్థులు జి. రమణ, నమ్మి. రాజగోపాల్, కె.ఆదినారాయణ శ్రీ హరి సేవ సభ్యులు పాల్గొన్నట్లు కార్యనిర్వహణాధికారి డీవీఎస్ సురేష్ బాబా తెలియజేశారు.

# జిఓ.117 ను తక్షణమే రద్దు చేయాలి



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : ప్రభుత్వం ఉపాధ్యాయుల రేషనలైజేషన్ పేరుతో ఇటీవల విడుదల చేసిన జి ఓ.117 ను తక్షణం రద్దు చేయాలని బలహీన వర్గాలకు విద్యా హక్కుచట్టం అమలలో బాగంగా అందరికీ విద్య సంపూర్ణంగా అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు,రేబాక రవికుమార్, సబ్బారపు నూకరాజు కోరారు . బుదవారం సాయంత్రం అచ్యుతాపురం మండల విద్యాశాఖ కార్యాలయం నందు వారు మాట్లాడుతూ నేడు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, అనకాపల్లి నందు ఉపాధ్యాయుల యొక్క పలు సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో అధ్వర్యంలో జరుగుచున్న ఉపాధ్యాయుల నిరసన కార్యక్రమంలో అచ్యుతాపురం మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (%ఖుఖీ%) నాయకులు, కార్యకర్తలు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

# పెదచెరువు వంతెన నిర్మాణానికి భూమిపూజ

- ముఖ్య అతిథిగా ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్
- రాంఖీ పౌండేషన్ కు కృతజ్ఞతలు తెలిపిన రెడ్డిశ్రీను





పరవాడ (విజయభాను న్యూస్) : మండల కేంద్రమైన పరవాడలో గల పెదచెరువు వద్ద వంతెన నిర్మించేందుకు రాంఖీ పౌండేషన్ వారు సుమారు పదిలక్షలు వెచ్చించి వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు,.ఈవంతెన నిర్మాణానికి బుధవారం పెదచెరువు అయుకట్టుదారుల సంఘం ప్రెసిడెంట్ రెడ్డి శ్రీనువాసురావు అద్వర్యంలో పార్మాపౌండేషన్ వారు సౌరధ్యంలో వంతెన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికీ ముఖ్యఅతిథిగా పరవాడ ఎంపిపి పైల వెంకటపద్మ లక్ష్మి శ్రీనివాసురావు హజరై వీళ్ళు చేతులు మీదగా కొబ్బరికాయకొట్టీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్ మాట్లడుతూ వర్షాకాలంలో రైతులు ఏదుర్కొంటున్న కష్టాలును గుర్తించి రాంఖీపౌండేషన్ వారు పెదచెరువు వద్ద వంతెనను నిర్మించడము ఎంతో అభినంద నీయమనీ కొనియాడారు.

ఈ సందర్భంగా రాంఖీ పౌండేషన్ వారికి పెదచెరువు అయకట్టుదారుల సంఘం ప్రెసిడెంట్ రెడ్డి శ్రీనువాసురావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియపరిచారు. ఈకార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీసర్పంచ్ చుక్కరాము నాయుడు, రాంఖీ పౌండేషన్ ప్రతినిధి శ్రీకాంత్,ఉపసర్పంచ్ బండారు రామారావు,పైలహరేష్ ,యస్ యస్ నాయుడు,పైల అప్పలనాయుడు,చిరికి అప్పారావు, సిరపురపు అయ్యబాబు,వర్రీ హరి,రెడ్డి చిన్నా,రెడ్డివెంకటరావు,పైల నారాయణమూర్తి, బత్తిఅ-ప్పారావు ,గండీ శ్రీను,చుక్క అప్పలనాయుడు,మరియు రైతులు తథితర్లు పాల్గొన్నారు.

# జ్యుడీషియల్ గ్రాంటును ఒకే విధంగా అమలు చేయాలని వినతి



కాకినాడ (విజయభాను న్యూస్): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జ్యుడీషియల్ గ్రాంటును ఒకే విధానంలో అమలు పరచాలని కోరుతూ కేంద్ర సమాచార, ప్రసార,పశుసంవర్ధక,పాడి శాఖల సహాయ మంత్రి ఎల్.మురుగన్ కు ఆంధ్ర ప్రదేశ స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ నరహరశెట్టి రవి కృష్ణ వినతి పత్రం సమర్పిం చారు. కాకినాడకు విచ్చేసిన ఆయనను మర్యాద పూర్వకంగా రవికృష్ణ మరో ఇద్దరు న్యాయవాదులు పెండెం శ్రీదేవి,రాజ్ కుమార్ కలిశారు.

రాష్ట్రంలో అదనపు కోర్టులు అవసరం ఉందని, న్యాయమూర్తుల నియామకం కూడా జరగాలని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోర్టులకు వచ్చే కక్షిదారులకు మౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని వేడుకొన్నారు. దీంతో కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.తక్షణమే స్పందించిన మంత్రికి రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ నరహరశెట్టి రవికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# బెల్లీ ఫ్యాట్ తగ్గాలా..
## ఉదయాన్నే ఈ వాటర్ తాగితే బెస్ట్ రిజల్ట్స్..!



ఈ రోజుల్లో చాలా మంది ఊబకాయం బారిన పడుతున్నారు. బరువు పెరగడం చాలా సులభం. కానీ, బరువు తగ్గడం కూడా అంతే కష్టం. మరోవైపు, డైటింగ్, వర్కౌట్ చేసిన తర్వాత పొట్ట కొవ్వు తగ్గడానికి నెలల సమయం పడుతుంది. కానీ, మీరు త్వరగా ఫిట్ అవ్వాలనుకుంటే, వెల్లుల్లి వాటర్ తాగడం వల్ల ప్రయోజనం ఉంటుంది. బెల్లీ ఫ్యాట్ తగ్గించుకోవడానికి గార్లిక్ వాటర్ బెటర్ ఆప్షన్. ఇది పోషకాలతో నిండి ఉంది. ఆరోగ్యానికి చాలా ఉపయోగ కరంగా ఉంటుంది. వెల్లుల్లి రోగ నిరోధక శక్తిని పెంచడమే కాకుండా గుండె జబ్బుల నుంచి రక్షించడంతో పాటు బరువును కూడా తగ్గిస్తుంది. గార్లిక్ వాటర్ తాగడం వల్ల ఎలాంటి లాభాలు పొందవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం.

బరువు తగ్గడంలో వెల్లుల్లి ఎలా పని చేస్తుంది?

వెల్లుల్లిలో ఫైబర్, కాల్షియం, విటమిన్ బి6, విటమిన్ సి, మాంగనీస్ ఉంటాయి. ఈ పోషకాలన్నీ బరువు తగ్గడానికి సహాయపడతాయి. మీరు ఆరోగ్యకరమైన, చురుకైన జీవనశైలిని అవలంబించడంతో పాటు వెల్లుల్లి నీరు లేదా వెల్లుల్లిని క్రమం తప్పకుండా తీసుకుంటే, మీ బరువు ఒక వారంలో తగ్గించవచ్చు.వెల్లుల్లి శరీరం నుంచి విషాన్ని, హానికరమైన పదార్థాలను బయటకు పంపుతుంది. అలాగే జీర్ణశక్తిని పెంచుతుంది. ఇది వేగంగా బరువు తగ్గడానికి దారితీస్తుంది.వెల్లుల్లిలో ఆకలిని తగ్గించే గుణాలు ఉన్నాయి. దీని వల్ల ఎక్కువ తినాలనే కోరిక ఉండదు. దీన్ని తీసుకోవడం వల్ల చాలా కాలం పాటు కడుపు నిండుగా ఉంటుంది.

వెల్లుల్లి జీవక్రియను పెంచుతుంది. ఇది శక్తి స్థాయిని పెంచుతుంది. ఇది కేలరీలను బర్న్ చేస్తుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది.వెల్లుల్లి నీటిని ఎలా తయారు చేయాలి- ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో నిమ్మరసం, తురిమిన వెల్లుల్లిని కలపండి. దీన్ని ఖాళీ కడుపుతో తాగండి. ఇలా చేయడం వల్ల మీ పొట్ట కొవ్వు సులభంగా తగ్గిపోతుంది.

# గొంతు నొప్పితో బాధపడుతున్నారా?
## సింపుల్‌గా ఇలా చేయండి !!





చలికాలంలో సీజనల్ వ్యాధులు, వైరల్ ఇన్ఫెక్షన్లు బాగా ఇబ్బంది పెడతాయి. తరచూ జలుబు-దగ్గు, గొంతునొప్పి, జ్వరం లాంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది.చలికాలంలో సీజనల్ వ్యాధులు, వైరల్ ఇన్ఫెక్షన్లు బాగా ఇబ్బంది పెడతాయి. తరచూ జలుబు-దగ్గు, గొంతునొప్పి, జ్వరం లాంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ సమస్యలను ఎదుర్కోవటానికి మీరు కొన్ని ఇంటి చిట్కాలను పాటిస్తే.. వెంటనే ఉపశమనం పొందవచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. దగ్గు, గొంతులో మంట, తీవ్రమైన నొప్పితో బాధపడేవారు.. ఒక చెంచా తేనె తినడం ద్వారా ఉపశమనం పొందవచ్చు. ఒకవేళ తేనెను నేరుగా తినలేకపోతే.. పాలలో గాని, నీటిలో గాని కలుపుకొని తాగవచ్చు. తేనెలోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మీ గొంతుకు వెంటనే ఉపశమనం కలిగిస్తాయి. దీంతోపాటు శరీరానికి అవసరమైన పలు ఔషధాలు అందుతాయి. దగ్గు, గొంతు నొప్పితో బాధపడే వారు.. యాంటీఆక్సిడెంట్ అధికంగా ఉండే పుదీనా టీ తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇది మీ ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

## జీడిపప్పు ఆరోగ్యానికి మంచిదే.. కానీ అధికంగా తింటే మాత్రమే
# ప్రమాదం..



డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వింటర్ సీజన్‌లో తినడం చాలా మంచిది. వివిధ రకాల డ్రై ఫ్రూట్స్‌లో వివిధ గుణాలు ఉంటాయి. ఈ రోజు జీడిపప్పు వినియోగం చాలా పెరిగింది. అంతే కాదు అది అందించే లాభాల గురించి చాలా చోట్ల రాస్తున్నారు.. వైద్యులు కూడా సూచిస్తున్నారు. జీడిపప్పు ప్రయోజనాల గురించి మాట్లాడుతూ.. ఇది శరీరానికి మాత్రమే కాకుండా చర్మం, జుట్టుకు కూడా చాలా ఉపయోగకరంగా పరిగణించబడుతుంది. ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వింటర్ సీజన్‌లో తినడం చాలా మంచిది. వివిధ రకాల డ్రై ఫ్రూట్స్‌లో వివిధ గుణాలు ఉంటాయి. ఈ రోజు జీడిపప్పు వినియోగం చాలా పెరిగింది. అంతే కాదు అది అందించే లాభాల గురించి చాలా చోట్ల రాస్తున్నారు.. వైద్యులు కూడా సూచిస్తున్నారు. జీడిపప్పు ప్రయోజనాల గురించి మాట్లాడుతూ.. ఇది శరీరానికి మాత్రమే కాకుండా చర్మం, జుట్టుకు కూడా చాలా ఉపయోగకరంగా పరిగణించబడుతుంది. ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిలో ఐరన్, జింక్ పుష్కలంగా ఉంటాయి. రక్తహీనత సమస్య నుంచి ఉపశమనంను అందిస్తాయి. వీటిలో విటమిన్ సి, జింక్, మెగ్నీషియం, సెలీనియం, ఐరన్ పుష్కలంగా ఉంటాయి.

జీడిపప్పులో చాలా ప్రయోజనాలు ఉన్నప్పటికీ (జీడిపప్పు అతిగా తింటే ప్రతికూలతలు) శరీరానికి కూడా హాని కలిగిస్తుంది. మీరు జీడిపప్పును అవసరమైన దానికంటే ఎక్కువగా తీసుకుంటే అది హానికరంగా మారుతుంది. అయితే చాలా మందికి ఈ విషయం తెలియక అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటారు. ఈ ప్రతికూలతల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

కడుపులో సమస్యలు

ఏదైనా కారణం వల్ల మీ కడుపు చెడిపోయినట్లయితే.. పొరపాటున ఈ స్థితిలో జీడిపప్పు తినకూడదు. ఇది పొట్ట సమస్యను మరింత పెంచుతుంది. జీడిపప్పును ఎక్కువగా తినడం వల్ల అజీర్ణం, విరేచనాలు, గ్యాస్, కడుపులో ఇతర సమస్యలు వస్తాయని కూడా నిపుణులు అంటున్నారు. అందువల్ల, జీడిపప్పును రోజూ తినండి కానీ అతిగా తినకండి.

ఊబకాయం

జీడిపప్పులో చూస్తే చాలా క్యాలరీలు ఉంటాయి, ఎక్కువగా తీసుకుంటే స్థూలకాయం వస్తుంది. ఊబకాయం ఉన్నవారు జీడిపప్పును తినకూడదని సూచిస్తున్నారు. రోజులో 4 నుండి 5 జీడిపప్పు తినడం చాలా మంచిది. ఇలా చేయడం వల్ల మీరు కూడా ఆరోగ్యంగా ఉంటారు.

అలర్జీలు

కనిపిస్తే, కొన్నిసార్లు జీడిపప్పుకు అలెర్జీ సమస్య ఉంటుంది. అలెర్జీలు మీ చర్మంపై దురద లేదా దద్దుర్లు కలిగించవచ్చు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇప్పటికే అలెర్జీల సమస్యను ఎదుర్కొంటున్న వ్యక్తులు జీడిపప్పు వినియోగానికి దూరంగా ఉండాలి. ఇది వారి ఇబ్బందులను మరింత పెంచే అవకాశం ఉంది.

తలనొప్పి

జీడిపప్పులో ఉండే అమినో యాసిడ్‌లు టైరమైన్, ఫినైల్‌థైలమైన్‌లు తలనొప్పికి కారణమవుతాయి. తరచుగా తలనొప్పి లేదా మైగ్రేన్‌లు ఉన్నవారు జీడిపప్పును అస్సలు తీసుకోవద్దని సలహా ఇస్తారు.

## ఎవరైనా ఆవలించడం చూసి ఇతరులు కూడా ఎందుకు ఆవలిస్తారు..?
# పరిశోధనలలో కీలక విషయాలు..!



ఇతరులను ఆవలిస్తున్నప్పుడు మీరు కూడా ఆవలిస్తుంటారు. అలా ఎందుకు ఆవలింతలు వస్తాయో మీరు ఎప్పుడైనా గమనించారా..? చాలా మంది ఆవులించడం అనేది నిద్రలేమి..

ఎవరైనా ఆవలించడం చూసి ఇతరులు కూడా ఎందుకు ఆవలిస్తారు..? పరిశోధనలలో కీలక విషయాలు..!

ఇతరులను ఆవలిస్తున్నప్పుడు మీరు కూడా ఆవలిస్తుంటారు. అలా ఎందుకు ఆవలింతలు వస్తాయో మీరు ఎప్పుడైనా గమనించారా..? చాలా మంది ఆవులించడం అనేది నిద్రలేమి, నీరసాన్ని సూచిస్తుందని భావిస్తుంటారు. అయితే దీనికి కూడా ఒక సైన్స్ ఉంది. ఆవలింతలపై ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం పరిశోధన చేసింది. ఇది నిద్రకు సంబంధించినది అనే వాదనను పరిశోధన ఫలితాలు తోసిపుచ్చాయి. ఆవలింత ఎందుకు వస్తుంది. ఒకరు ఆవలింతలు తీస్తే దానిని చూసిన వారు కూడా ఆవలించడంపై వివరాలు వెల్లడించారు.

మెదడు తనను తాను చల్లగా ఉంచుకునేందుకు..

ఆవలింత మెదడుకు సంబంధించినదని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నివేదిక చెబుతోంది. మెదడు తనను తాను చల్లగా ఉంచుకోవడానికి ఇలా చేస్తుందని వెల్లడించారు. బయట ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు శరీర ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. అదే సమయంలో, శీతాకాలంలో శరీర ఉష్ణోగ్రత బయట కంటే ఎక్కువగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో మెదడు మరింత ఆక్సిజన్‌ను లాగడం ద్వారా దాని ఉష్ణోగ్రతను నియంత్రిస్తుంది.

ఆవలింతకు.. వాతావరణానికి సంబంధం ఉందా..?

ఆవలింతకు వాతావరణానికి కూడా సంబంధం ఉందని పరిశోధకులు చెబుతున్నారు ప్రిన్స్‌టన్ యూనివర్శిటీకి చెందిన పరిశోధకులు. 180 మంది ఆవులించడాన్ని గుర్తించేందుకు పరిశోధన చేశారు. వీరిలో వేసవిలో 80 మందిని, శీతాకాలంలో 80 మందిని పరిశోధనలో చేర్చారు. వీటికి సంబంధించిన పరిశోధనా నివేదికను పోల్చిచూసినప్పుడు వేసవిలో కంటే చలికాలంలోనే ఎక్కువ మంది ఆవలిస్తున్నట్లు తేలింది.

ఎదుటి వ్యక్తులను చూసే ఆవలించడం..

2004లో జరిగిన ఒక పరిశోధన ప్రకారం.. 50 శాతం మంది తమ ఎదుటి వ్యక్తి ఇలా చేయడం చూసి ఆవలించడం ప్రారంభిస్తారని తేలింది. అలాగే ఇతరులను చూసిన తర్వాత మనుషులు ఎందుకు ఆవలిస్తారో తెలుసుకునేందుకు మ్యూనిచ్‌లోని సైకియాట్రిక్ యూనివర్సిటీ హాస్పిటల్ 300 మందిపై పరిశోధన చేసింది. పరిశోధనలో పాల్గొన్న వ్యక్తులకు ఆవలిస్తూ వీడియోలు చూపించారు. దీని తర్వాత షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.వీడియో చూస్తున్నప్పుడు వ్యక్తులు 1 నుండి 15 సార్లు ఆవులించారని పరిశోధన నివేదిక చెబుతోంది. ఒక వ్యక్తి ఆవులించడం చూసినప్పుడల్లా అతని మిర్రర్ న్యూరాన్ వ్యవస్థ యాక్టివేట్ అవుతుందని పరిశోధకులు చెబుతున్నారు. దీని ప్రత్యక్ష సంబంధం మానవ మెదడుతో ఉంటుంది. మిర్రర్ న్యూరాన్ వ్యవస్థ సక్రియం అయినప్పుడు, అది ఇతరులను అనుకరించమని మానవులను ప్రేరేపిస్తుందని పరిశోధ కులు వెల్లడించారు.

# సహాయం



రంగాపురంలో ఉండే రంగయ్య వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తూ ఉండేవాడు. ఇంటి వద్ద ఒక కుక్కను పెంచుతూ ఉండేవాడు. రంగయ్య ఇంటి దగ్గర ఉన్న చెట్టుపై రెండు కాకులు ఉండేవి. ఆ కుక్కకు కాకులతో స్నేహం ఏర్పడింది. కుక్కకు రంగయ్య పెట్టిన ఆహారాన్ని అప్పుడప్పుడూ కాకులు కూడా వచ్చి తినేవి. రంగయ్య తన పొలంలో చెరుకు తోట వేశాడు. ఒక నక్క రోజూ వచ్చి చెరకును తినేస్తూ ఉండేది. ఎవరు పాడుచేస్తున్నారనే విషయం రంగయ్యకు అర్థం కాలేదు.

ఒక రోజు తన భార్యతో 'మన అప్పులు ఎలా తీర్చాలి? పంట చేతికి వస్తే ఇల్లు మరమ్మతు చేయిద్దాం అనుకున్నాను. కానీ చెరుకు తోటను ఎవరో పాడు చేస్తున్నారు?' అని చెప్పి బాధపడ్డాడు. కాకులు, కుక్క ఆ మాటలు విన్నాయి. 'మనల్ని రంగయ్య ఎన్నో రోజుల నుంచి ఆహారం పెట్టి మంచిగా చూసుకుంటున్నాడు. ఎలాగైనా మనం రంగయ్యకు సహాయపడాలి' అని అనుకున్నాయి.

ఒకరోజు కాకులు, కుక్క చెరుకు తోట దగ్గరకు వెళ్లాయి. తోట బయట చెట్టు మీద కాకులు, చెట్టు వెనుక కుక్క దాక్కొన్నాయి. నక్క చెరుకు తోటలోకి ప్రవేశించే సమయం చూసి, అరుస్తూ నక్క మీద దాడిచేశాయి. ఆ సమయంలో అటుగా వచ్చిన రామయ్య ఆ సంఘటన చూశాడు. వాటి దెబ్బకి నక్క పరుగెత్తి పోయింది. మరుసటి రోజు నుంచి తోట చుట్టుపక్కలకు రాలేదు. కుక్కతో పాటు కాకులు కూడా సహాయపడినందుకు రామయ్య ఆనందపడ్డారు. అప్పటి నుంచి కుక్కతో సమానంగా కాకులకు కూడా ఆహారం వేయసాగాడు.

- సభావత్ చంటి,
9వ తరగతి, జెడ్పీహెచ్ఎస్, నేరెళ్ల పల్లి,
బాలానగర్ మండలం, మహబూబ్ నగర్ జిల్లా.

# ఇంట్లోనే విద్యుత్తు, కూరగాయలు





గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతంలో నీటి కొరత తీవ్రంగా ఉంటుంది. అలాంటి చోట ఒక ఇంట్లో కూరగాయల సాగు జరుగుతోంది. విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ఇప్పుడు ఆ ఇల్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

అమ్రేలిలో నివాసం ఉన్న కనూభాయ్ కర్కరే కుటుంబం నీటి కొరతతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. వారు ఉంటున్న ప్రదేశానికి 15 రోజులకోసారి మున్సిపల్ నీళ్లు వస్తాయి. వాటిని పట్టుకుని మిగిలిన రోజుల్లో పొదుపుగా వాడుకునేవారు. ఈ సమస్యకు ఏదొక పరిష్కారం వెతకాలి అని కనూభాయ్ అనుకున్నారు. 20 ఏళ్ల క్రితం కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టినప్పుడు ఒక ప్రణాళికను అమలు చేశారు. కనూభాయ్ ఒక పాధ్యాయుడు. తన ఇల్లు ఎలా ఉండాలో ఆయనే ప్లాను రూపొందించుకున్నారు. తొలుత వర్షపు నీటిని నిల్వ చేసే 20 వేలు, 8 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు భూగర్భ నీటి ట్యాంకులు నిర్మించారు. వర్షాకాలంలో కురిసిన నీరంతా ఈ ట్యాంకుల్లోకి వెళతాయి. ఈ నీటి ఆధారంగా పెరట్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు మొదలు పెట్టారు.



అలాగే ఇంట్లో వాడిన నీటిని శుద్ధి చేసి మొక్కలకు అందేలా బిందు సేద్య పద్ధతి ఏర్పాటు చేశారు. సూర్యరశ్మి ఇంట్లో పడేలా పెద్ద పెద్ద కిటికీలు, ద్వారాలు పెట్టుకున్నారు. క్రాస్ వెంటిలేషన్ టెక్నిక్‌తో ఇంటికి గాలి, వెలుతురు ప్రసరణ అధికంగా ఉండేలా చూసుకున్నారు. దీంతో, పగటి పూట లైట్లు, ఫ్యాన్ల అవసరం ఉండేది కాదు. వంటగది, బాత్‌రూమ్ నుంచి వచ్చే వాడుక నీటిని రీసైకిల్ చేయడానికి రెండడుగుల పొడవైన గొట్టాలను నిర్మించారు. లోపల వ్యర్థాలలో ఉన్న సంక్లిష్ట మూలకాలను విచ్ఛిన్నం అయ్యేలా వీలు కల్పించారు. శుద్ధి అయ్యి పైపుల నుంచి బయటకు వచ్చే నీరు పెరట్లోని మొక్కలు, చెట్లకి ఉపయోగపడుతుంది. ఇంటి ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో రకరకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండిస్తున్నారు. ఇంటి వద్దనే 3 కిలోవాట్ల సోలార్ పవర్ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేశారు. దాని ద్వారా ఇంటి విద్యుత్ అవసరాలు తీరటమే కాకా ప్రభుత్వ గ్రిడ్‌కు కరెంటు సరఫరా చేసి, నెలకు రూ.10 వేల ఆదాయం పొందుతున్నారు. కనూభాయ్ కుటుంబం తమ ఇంటికి సరిపడా నీరు నిల్వ చేయడం, విద్యుత్ సరఫరా చేయడం .. అధికారులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. అందుకే కనూభాయ్ ఇంటిని 'ఆదర్శ ఇల్లు'గా గుర్తించి అవార్డు అందించారు.

## వైద్య పరికరాలకూ వర్ణ వివక్ష!

అదేంటి వైద్య పరికరాలకు వర్ణ వివక్ష ఏంటి అనుకుంటున్నారా? అదేనండి వాటి తయారీ సమయంలో రాసిన ప్రోగ్రామింగ్.. దానివల్ల అందులో తలెత్తిన సమస్యలే ఇందుకు కారణం. శరీరంలో ఆక్సిజన్ శాతం ఎంతుందో తెలుసుకోవడానికి పల్స్ ఆక్సీమీటర్లు వాడుతుంటాం. కరోనా సమయంలో వీటి అవసరం, వాడకం మరింత పెరిగింది. ఇప్పుడు ఆక్సీమీటర్ లేని ఇల్లు లేదంటే అతిశయోక్తికాదు. అయితే, ఆ వైద్య పరికరాలు వాడే వాళ్ల శరీరం రంగును బట్టి భిన్నమైన రీడింగ్స్ ఇస్తున్నట్లు తాజా అధ్యయనంలో తేలింది. భిన్నమైన రీడింగ్స్ ఎందుకు వస్తున్నాయి? దాని వెనుకున్న కారణాలేంటి? వంటి విషయాలు తెలుసుకుందాం..!పల్స్ ఆక్సీమీటర్లు రక్తంలోని ఆక్సిజన్ స్థాయిని తెలియజేస్తాయనే విషయం ఇటీవలి కాలంలో అందరికీ తెలిసిందే. కరోనా సమయంలో చాలామంది ప్రజలు తమ ఆక్సిజన్ లెవెల్స్ తెలుసుకునేందుకు వీటిపైనే ఆధారపడ్డారు. అయితే పల్స్ ఆక్సీమీటర్లలో కచ్చితత్వం లోపిస్తోందని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న పల్స్ ఆక్సీమీటర్లు ముదురు రంగు చర్మం (డార్క్ స్కిన్ కలర్) ఉన్నవారి విషయంలో తప్పుగా రీడింగ్ చూపిస్తున్నాయని అధ్యయనాలు తెలుపుతున్నాయి. అనేక మంది తమ ప్రాణాలు పోగొట్టుకున్నారనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి.

# మరింత ఆకర్షణీయంగా బీచ్ అభివృద్ధి

**- ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయ రీజనల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి**





విశాఖపట్నం (విజయభాను న్యూస్) : మరింత ఆకర్షణీయంగా విశాఖ బీచ్ ను అభివృద్ధి పరుస్తామని ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయ రీజనల్ కో ఆర్డినేటర్, టిటిడి చైర్మన్ వై. వి. సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆర్. కె. బీచ్ ప్రాంతంలో జిల్లా కలక్టర్, డాక్టర్ ఎ. మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ డాక్తర్ జి. లక్ష్మీశతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగరం ఎంతో సుందర నగరమని, పర్యాటక పరంగా ఎంతో మంది నగర వాసులే కాకుండా దేశ విదేశాల నుండి పర్యాటకులు వ్వస్తారని, వారికి మంచి వాతావరణంతో పాటు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని, అందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న రెండు, మూడు నెలలలో బీచ్ ను ఆకర్షణీయంగా తీర్చుతామని, తిరుమలలో ఇప్పటికే ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించామని అలాగే మన నగరంలో ముఖ్యంగా బీచ్ లో ఎటువంటి నిషేధిత ప్లాస్టిక్ ను అనుమతించబోమని, అందుకు ఇప్పటికే కలక్టర్, కమిషనర్ ఎంతో కృషి చేస్తున్నారని, ప్లాస్టిక్ వాడడం వలన బీచ్ కలుషితం అవుతుందని, అందుకు ఇక్కడ వ్యాపారస్తులు, సందర్శకులు సహకారం అవసరమని, విశాఖ ప్రజలు చాలా సౌమ్యులని, ప్రభుత్వం తలపెట్టిన ప్రతి పనికి ఎంతో సహకరిస్తారని తెలిపారు. పర్యాటక నగరంగా టూరిస్టులకు మెరుగైన సౌకర్యాలు కల్పించుటకు, సందర్శకుల సౌకర్యార్ధం క్లీనింగ్, త్రాగు నీరు, విద్యుత్ అలంకరణ, పిల్లలకు కావలసిన ఆటవిడుపు సామగ్రి, సేదతీరెందుకు ఆకర్షనీయమైన బెంచీలు ఏర్పాటు తదితర పనులు చేపట్టేందుకు అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, బీచ్ లోని వాకర్స్, సీనియర్ సిటిజన్స్ తో ముచ్చటిస్తూ బీచ్ లోని సమస్యలను అడిగారు. అందుకు గతంలో రాత్రి పారిశుధ్య పనులు జరిగేవని, తెల్లవారుజామున 4 గంటలకు వాకింగ్ కు వచ్చే సరికి బీచ్ ఎంతో శుభ్రంగా ఉండేదని, ప్రస్తుతం రాత్రి పారిశుధ్య పనులు సరిగా జరగడంలేదని తెలపగా రాత్రి పారిశుధ్య పనులు చేపట్టి బీచ్ ను శుభ్రపరచాలని అధికారులను ఆదేశించారు.

ఈ పర్యటనలో టూరిజం కార్పోరేషన్ చైర్మన్ ఎ. వరప్రసాద్ రెడ్డి, బ్రాహ్మణ కార్పోరేషన్ చైర్మన్ శీతంరాజు సుధాకర్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్ జి శాస్త్రి, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఎఎంఓహెచ్ డాక్టర్ సునీల్, సహాయక ఇంజినీరు సత్యనారాయణ, శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, సచివాలయ కార్య దర్శులు తదితరులు పాల్గొన్నారు.

## కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పై

# అప్రమత్తంగా ఉండాలి

**- కుటుంబ సంక్షేమ శాఖ, కమిషనర్ జె.నివాస్**



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పై పూర్తి అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని కుటుంబ సంక్షేమ శాఖ, కమిషనర్, జె.నివాస్ అన్నారు. బుధవారం ఉదయం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి, ప్రోగ్రాం అధికారులు మరియు వైద్యాధికారులు తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్ తనిఖీ, కాలానుగుణంగా వచ్చే వ్యాధులు, మలేరియా, డెంగ్యూ నివారణ తదితర అంశంల పై తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేసారు. ఉప కేంద్రాలలో మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉండవలసిన మందులు, చెయ్యవలసిన పరీక్షలు, కోవిడ్ వాక్సినేషన్, గర్భిణీ స్త్రీలు, బాలింతలుకు రక్తపరీక్షలు, ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన ద్వారా నగదు ప్రోత్సాహకం మొదలగు అంశంల పై సమీక్ష నిర్వహించారు. ఉద్యోగులు తప్పని సరిగా బయోమెట్రిక్ హాజరు పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. కె.విజయలక్ష్మీ, ప్రోగ్రాం అధికారులు మరియు వైద్యాధికారులు పాల్గొన్నారు.

# ఓటేసిన ప్రజలకు..చంద్రబాబు ఒక్క మంచి పథకం అందించారా?

**ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్**



తాడేపల్లి: ఓటేసిన ప్రజలకు తన హయాంలో చంద్రబాబు నాయుడు ఒక్క మంచి పథకమైనా అందించారా?.. అని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రశ్నించారు. ఆనాడు ఏం చేయకుండా.. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం జగన్ చేస్తుంటే ఓర్వలేకపోతున్నారని అన్నారాయన. బుధవారం సాయంత్రం తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. "టీడీపీ నేతలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. చంద్రబాబు తన పార్టీ నేతలను రెచ్చగొడుతున్నారు. చంద్రబాబు తన హయాంలో ఇంత మెరుగైన పాలన అందించారా? ఓటేసిన ప్రజలకు ఒక్క మంచి పథకమైనా అమలు చేశారా?. చంద్రబాబును ప్రజలు వద్దనుకున్నారు కాబట్టే తరిమికొట్టారని మంత్రి అమర్‌నాథ్ అభిప్రాయపడ్డారు.

తన పేరు చెబితే ప్రజలు ఓట్లే వేయరనే ఎన్టీఆర్ నామస్మరణ చేస్తున్నాడు చంద్రబాబు.

ఉత్తరాంధ్రకు మంచి చేద్దాం అనుకుంటున్న ఈ ప్రభుత్వ నిర్ణయానికి ప్రతిపక్షం అడుగడుగునా అడ్డుపడుతోంది. అయినా ప్రభుత్వం వెనక్కి తగ్గట్లేదు. సుమారు 32 లక్షల మంది సొంతింటి కలను నెరవేరుస్తున్నాం అని మంత్రి అమర్‌నాథ్ స్పష్టం చేశారు.

# పార్టీ కార్యాలయ స్థలాన్ని పరిశీలించిన వై.వి.సుబ్బారెడ్డి





మధురవాడ (విజయభాను న్యూస్) : ప్రతి జిల్లాలో వైసీపీ కార్యాలయాలను ఏర్పాటు చేస్తామని టిటిడి చైర్మన్, ఉత్తరాంధ్ర వైకాపా ఇంచార్జ్ వై.వి సుబ్బారెడ్డి అన్నారు. మహా విశాఖ జోన్ 2 , లోగల 8వార్డ్ పరిధి విశాఖ లా కాలేజి సమీపంలో సర్వే సంఖ్య 175/4 లో వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయం కోసం కేటాయించిన 2 ఏకరాల స్థలాన్ని బుధవారం విశాఖ జిల్లా వై ఎస్.ఆర్.సి.పి. పార్టీ ప్రెసిడెంట్, మాజీ మంత్రివర్యులు మరియు భీమిలి నియోజకవర్గపు శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు తో కలిసి అయన పరిశీలించారు. ఈ మేరకు అయన మాట్లాడుతూ జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించాలి అనే నిర్ణయాన్ని స్వయంగా ప్రభుత్వమే నిర్ణయించింది అని తెలియజేశారు. పార్టీ కార్యకర్తలకు ఏ అవసరానికి అయిన అనుగుణంగా వుండేందుకు ఈ పార్టీ కార్యాలయాలు నిర్మాణం చేపడుతున్నామని ఆయన అన్నారు. ప్రతి జిల్లాల్లో పార్టీ జిల్లా అధ్యక్షులుతో మాట్లాడి ఎక్కడ నిర్మించాలి అన్న విషయాన్ని నిర్ణయిస్తాం అని అన్నారు. మంచి ముహూర్తం చూసి నిర్మాణం ప్రారంభించి 6 నెలలో పూర్తి చేస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, విశాఖ రురల్ తహశీల్దార్ పాల్ కిరణ్, నగరాల కార్పొరేషన్ చైర్మన్ పిల్లా సుజాత సత్యనారాయణ, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సుధాకర్, పెడాడ రమణి, 8వ వార్డు కార్పొరేటర్ లోడగల అప్పారావు, పోతిన హనుమంతు రావు, బొట్ట అప్పలరాజు,గాదె రోసి రెడ్డి,పోతిన మూర్తి బాబు,మొజ్జడ రమణ మూర్తి, ముందుండి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# గీతం అంతర్జాతీయ చెస్‌పోటీలు

## కొనసాగుతున్న భారత క్రీడాకారుల ఆధిక్యం




సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : ప్రపంచ చదరంగ సమాఖ్య (ఫైడ్) మరియు అఖిల భారత చదరంగ సమాఖ్య పర్యవేక్షణలో ఆంధ్ర చదరంగ సంఘం వారం రోజుల పాటు నిర్వహిస్తున్న గీతం యూనివర్సిటీ 3వ వైజాగ్ గ్రాండ్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్-2022 పోటీలలో బుధవారం భారత క్రీడాకారుల ఆధిపత్యం కొనసాగింది.

బుధవారం జరిగిన పోటీలలో "ఎ" కేటగిరి విభాగంలో 8వ రౌండ్ పూర్తిఅయ్యేసరికి 5 గురు క్రీడాకారులు 6.5/8 పాయింట్ల ఆధిపత్యంతో కొనసాగుతుండగా వారిలో ఇద్దరు భారత క్రీడాకారులు ఉన్నారని ఆంధ్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.భీమారావు తెలిపారు. భారత క్రీడాకారులు గుస్సైన్ ఇమాల్ (భారత 2325 ర్యాంకింగ్ పశ్చిమ రైల్వే క్రీడాకారుడు), ఎ.అమేయ (భారత 2395 ర్యాంకింగ్ క్రీడాకారుడు) ఉన్నారని తెలిపారు. తెలంగాణాకు చెందిన మహిళా క్రీడాకారిణి వేల్పుల సరయు (భారత 1896 ర్యాంకింగ్ క్రీడాకారిణి) ప్రత్యర్ధి వియత్నంకు చెందిన నయూన్ వాన్‌గుయ్ పై నల్లపావులతో ఆడి విజయం సాధించారని అనంతరం ఉజబెకిస్తాన్ క్రీడాయకారుడు నిగమతో అర్తిక్ (ఉజిబెకిస్తాన్ 2462 ర్యాంకింగ్ క్రీడాకారుడు) పై 8వ రౌండ్‌లో పోటీని డ్రాగా ముగించారని కార్యదర్శి తెలిపారు.

**సి కేటగిరి పోటీలు ప్రారంభం :**

చదరంగం రేటింగ్‌లో 1600 దిగువన ఉన్న క్రీడాకారులకు బుధవారం నుంచి "సి"కేటగిరి విభాగంలో పోటీలను ప్రారంభించినట్లు కార్యదర్శి తెలిపారు. మొత్తం 486 మంది క్రీడాకారులు ఈ విభాగంలో తలపడుతున్నారని వెల్లడించారు. స్విస్ లీగ్ పద్దతిలో 10 రౌండ్‌లు నిర్వహించే ఈ పోటీలను అఖిల భారత చదరంగ సమాఖ్య సంయుక్త కార్యదర్శి అతుల్ కుమార్, పోటీల డైరక్టర్ కె.వి.వి.శర్మ సమక్షంలో ప్రారంభించినట్లు పోటీలు నిర్వహక కార్యదర్శి తెలిపారు.

# జూలై 12 న అప్పన్న గిరి ప్రదక్షిణ

**- 13 న అషాడ పౌర్ణమి వేడుకలు - స్వామి కి ఆఖరి విడత చందన సమర్పణ**



సింహాచలం. (విజయభాను న్యూస్) : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ప్రతియేటా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఉత్సవాల్లో గిరిప్రదక్షిణ ఉత్సవము విశేష ప్రాచుర్యం పొందిందనీ అప్పన్న ధర్మ కర్తల మండలి సభ్యులు జాతీయ జర్నలిస్టుల సంఘము కార్యదర్శి గంట్ల శ్రీను బాబు తెలిపారు... బుధవారం సింహాద్రి నాధుడునీ దర్శించుకొని , నిత్య కళ్యాణం సేవలో పాల్గొన్నారు.. ఈ సందర్భముగా శ్రీనుబాబు పలు ఉత్సవాలు వివరాలు వెల్లడించారు.. కరోనా కారణముగా గిరి ప్రదక్షిణ ఉత్సవము గడచిన రెండేళ్లుగా నిర్వహించలేదు. ఐతే ఈ ఏడాది కరోనా తగ్గుముఖం పట్టిన నేపద్యంలో గిరిప్రదక్షిణ ఉత్సవం జూలై 12 న నిర్వహించడానికి అవకాశం వుంది.. కొండ దిగువన తొలి పావంచా నుంచి ప్రారంభమైన ఈ గిరిప్రదక్షిణ మహోత్సవం సింహగిరి చుట్టూ 32 కిలోమీటర్ల పొడవున కాలి నడకన సాగనుంది.. జూలై 13 మరుసటి రోజు ఆషాఢ పౌర్ణమి నేపథ్యంలో సిరులొలికించే సింహాద్రి నాధుడుకి మూడు మణుగుల చందనాన్ని శాస్త్రోక్తంగా సమర్పించనున్నారు.. అదే ఆఖరి విడత చందన సమర్పణ కాగా ఆ తరువాత వచ్చే శ్రావణ పౌర్ణమికి కరాళ చందన సమర్పణ ప్రక్రియ పూర్తి కావడం జరుగుతుంది. దీనితో స్వామి పూర్తి నిత్య రూపములో కి వస్తారు... ఈ ఏడాది కళ్యాణ మహోత్సవం, చందనోత్సవం, ధ్వజ స్తంభాలు ప్రతిష్టలు, నృసింహ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా ఆలయ వర్గాలు నిర్వహించాయి,, ఈవో ఎంవీ సూర్య కళ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం విశేష ఏర్పాట్లు చేసింది,, ధర్మకర్తల మండలి పర్యవేక్షణ తోపాటు ఆయా

ఉత్సవాల విజయవంతానికి తమ వంతు సేవలు అందించింది. సింహగిరిపై నిర్వహిస్తున్న పలు రకాల ఆర్జిత సేవలు కి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.. ఇలా ఉండగా బుధవారం సింహగిరిపై భారీ వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా ఆహ్లాదకరంగా మారింది.. సింహగిరి అంత మబ్బులు మయంగా మారడంతో భక్తులు హర్షం వ్యక్తం చేసి కేరింతలు కొట్టారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com